ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
చిత్తూరు
జిల్లా వార్తలు
శనివారం 13 సెప్టెంబరు 2025

బిందు సేద్యానికి చేయూత

● 90శాతం రాయితీపై పరికరాలిస్తున్న ప్రభుత్వం



క్యాలీఫ్లవర్ సాగులో ఏర్పాటు చేసిన డ్రిప్ యూనిట్

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో చతికిలపడ్డ బిందుసేద్యం కూటమి ప్రభుత్వం వచ్చాక తిరిగి జీవం పోసుకుంది. పడమటి మండలాల్లో పండ్ల, పూలతోటలు సాగు చేస్తుండగా, తూర్పు మండలాల్లో చెరకు, కూరగాయల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. 2024-2025 సంవత్సరంలో 25,162 ఎకరాల్లో 11,739 మంది రైతులకు రూ.89.74కోట్ల రాయితీ అమలు చేశారు. 2025-26 సంవత్సరానికి 30వేల ఎకరాల బిందు, తుంపర్ల సేద్యానికి రూ.97.94 కోట్ల రాయితీని ప్రభుత్వం కేటాయించింది. ఇప్పటివరకు 43,180 ఎకరాల్లో సాగు చేసేందుకు యూనిట్ల కోసం 16,649 మంది రైతులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 2,160 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగుచేసే 909 మంది రైతులకు రూ.7.88 కోట్ల విలువైన పరికరాలు మంజూరు చేశారు.

పది రోజులకోసారి యూనిట్ల మంజూరు

బిందుసేద్యానికై దరఖాస్తు చేసుకున్న రైతులకు పది రోజులకు ఒకసారి యూనిట్లు మంజూరు చేస్తున్నారు. ఏటా జనవరి, ఫిబ్రవరి ఆపై నెలల్లో కేటాయింపులు చేయనుండగా, ఈ ఏడాది నుంచి ముందస్తుగానే ఆగస్టు నుంచే కేటాయింపులు చేయడం రైతులకు అనుకూలంగా మారింది.

చెరకు సాగుకూ..

పడమటి మండలాల్లో రైతులు ఎక్కువ శాతం ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారు. టమోటా, వంకాయ, బీన్స్ ఉర్లగడ్డ, దానిమ్మ, జామ, మామిడి, కొబ్బరి, క్యాబేజీ, చెరకు, బొప్పాయి తదితర పంటలకు బిందు సేద్యం యూనిట్లు అందజేస్తున్నారు. గతేడాది నుంచి చెరకు సాగుకు బిందు సేద్యంలో అధిక ప్రాధాన్యం ఇవ్వడంతో నగరి, నింద్ర, విజయపురం, కార్వేటినగరం తదితర మండలాల్లో రైతులకు మరింత ప్రోత్సాహకం లభిస్తోంది.

రాయితీతో ఇలా..

బిందు, తుంపర్ల సేద్యం కింద సాగు చేసే సన్న, చిన్నకారు, ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం, ఇతర రైతులకు 90 శాతం రాయితీతో యూనిట్లను రాష్ట్ర ప్రభుత్వం ఏపీ మైక్రో ఇరిగేషన్ ద్వారా అందజేస్తోంది. ఒక్కో రైతుకు గరిష్ఠంగా రూ.2.18 లక్షల వరకు బిందు సేద్య పరికరాలు అందిస్తున్నారు. ఐదు నుంచి 10 ఎకరాల్లోపున్న రైతులకు 90 శాతంతో గరిష్ఠంగా, ఆపైబడి సాగుచేసే రైతులకు 50 శాతం సబ్సిడీ ఇస్తున్నారు. బిందు, తుంపర్ల సేద్యం యూనిట్లను రైతుల పొలాల్లో అమర్చేందుకు జిల్లాలో దాదాపు 27 కంపెనీలున్నాయి.

నీరు కట్టాలనే దిగులు లేదు

3.5 ఎకరాల్లో చామంతి పూల సాగు చేస్తున్నా. సున్నితమైన పంట కావడంతో సరైన సమయానికి నీరు అందించాలి. డ్రిప్ యూనిట్ మంజూరు చేయడంతో పొలంలో అమర్చుకున్నారు. దీంతో తోటకు నీరు కట్టాలనే దిగుల్లేదు. పంట దిగుబడి కూడా సమయానికి చేతికి వస్తోంది.

- వీఆర్ మోహన్,ఎంకేపురం, శాంతిపురం మండలం



పూల సాగులో వీఆర్ మోహన్

90 శాతం రాయితీ వచ్చింది



ఉర్లగడ్డ సాగులో విజయలలిత

2.5 ఎకరాల్లో ఉర్లగడ్డ సాగు చేస్తున్నా. వర్షాభావ పరిస్థితులు తట్టుకోవడానికి బిందు సేద్యం యూనిట్ ఎంతగానో ఉపయోగపడుతుంది. అడిగిన వెంటనే 90 శాతం సబ్సిడీపై ఇచ్చారు. సాగుకు భయం లేదనిపిస్తోంది.

- విజయలలిత, పాముగానిపల్లె, వి.కోట మండలం



శాంతిపురం మండలంలో క్యాబేజీ పొలాన్ని పరిశీలిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ నరేంద్ర పడాల్, ఏపీ ఎంఐపీ పీడీ పీవీ రమణ తదితరులు (ఫైల్ ఫొటో)

అర్హులందరికీ యూనిట్ల మంజూరు



అర్హులైన ప్రతి రైతులకూ సాగు ఆధారంగా బిందు, తుంపర్ల సేద్యానికి యూనిట్లు మంజూరు చేస్తాం. ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులకు వంద శాతం, మిగిలిన రైతులకు 90శాతం సబ్సిడీపై ప్రభుత్వం యూనిట్లు ఇచ్చేందుకు ఆమోదం తెలిపింది. తక్కువ నీటితో ఎక్కువ సాగు చేసుకోవడంతోపాటు సకాలంలో పంట చేతికి వస్తుందనే నమ్మకం ఉంటుంది.

- పీవీ రమణ, ప్రాజెక్టు డైరెక్టర్, ఏపీఎంఐపీ

విమానంలో విఘ్ననాథుడి విహారం





ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఉత్సవాల్లో శుక్రవారం రాత్రి విమానోత్సవం వైభవంగా జరిగింది.ఐరాలకు చెందిన కేఆర్.గణపతి కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఉదయం స్వామివారికి అభిషేకం నిర్వహించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. రాత్రి ఉభయదారులు ఉభయ వరస తీసుకురావడంతో అలంకార మండపంలో ఉత్సవ విగ్రహాలకు ఘనంగా పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం సిద్ధి,బుద్ధి సమేత వరసిద్ధి వినాయకస్వామి ఉత్సవ విగ్రహాలను సప్పరంపై ఉంచి కాణిపాక పురవీధుల్లో అంగరంగ వైభవంగా ఊరేగించారు.ఆలయ ఈవో పెంచల కిషోర్, ఏఈవోలు రవీంద్రబాబు, ఎస్వీ కృష్ణారెడ్డి, ఆలయ సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్లు చిట్టిబాబు, బాలాజీనాయుడు పాల్గొన్నారు.ప్రత్యేక ఉత్సవాల్లో శనివారం స్వామివారికి పుష్పపల్లకి సేవను నిర్వహించనున్నారు. పల్లకి ఏర్పాటుకు ఉభయదారులు విదేశీ పుష్పాలు కూడా తెప్పిస్తారు.ప్రధాన అలయంతో పాటు అనుబంధ ఆలయాలైన వరదరాజస్వామి , మణికంఠేశ్వర ఆలయాలను పుష్పాలతో అలంకరిస్తారు. పుష్పపల్లకి సేవను వీక్షించడానికి మన రాష్ట్రంతో పాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో భక్తులు కాణిపాకానికి విచ్చేస్తారు.

గత పాలకవర్గ తప్పిదాలపై తదుపరి విచారణకు ఆమోదం

● డీసీసీబీ ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో సభ్యుల సిఫార్సు



సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర రెడ్డి

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గత పాలకవర్గ హయాంలో జరిగిన ఆర్థిక విధ్వంసం, అవినీతి, అక్రమాలపై తదుపరి విచారణకు జిల్లా సహకార బ్యాంకు ప్రత్యేక సర్వసభ్య సమావేశం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. శుక్రవారం స్థానిక బ్యాంకు ప్రధాన కార్యాలయ ఆవరణంలో చైర్మన్ అమాస రాజశేఖర రెడ్డి అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. డీసీవో లక్ష్మి మాట్లాడుతూ వైసీపీ సర్కారు హయాంలో అప్పటి చైర్‌పర్సన్ రెడ్డెమ్మ నాయకత్వంలో అప్పటి నాన్ అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జి కమిటీ బృందం పెద్దఎత్తున అవినీతికి పాల్పడిందంటూ వచ్చిన ఆరోపణలపై ప్రభుత్వం విచారణకు ఆదేశించిందన్నారు. డీఆర్వో మోహన్‌కుమార్ వందమందికి పైగా సాక్షులను నాలుగు నెలల వ్యవధిలో విచారించి కలెక్టర్‌కు నివేదిక అందించారని చెప్పారు. ఆ నివేదికలో అంశాలపై సభ్యుల అభిప్రాయాలను తెలుసుకొని తదుపరి చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. దాంతో సమావేశం ఏకగ్రీవంగా తదుపరి విచారణకు ఆమోదం తెలుపుతూ అప్పటి పాలకవర్గంపై విచారణ కొనసాగించాలని సిఫార్సు చేసింది.బ్యాంకుకు జరిగిన నష్టాలను వారినుంచే రాబట్టాలని పలువురు సభ్యులు డిమాండ్ చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకునేందుకు నిష్పక్షపాతంగా తదుపరి విచారణ జరపాల్సిందేనని కోరారు. చైర్మన్ రాజశేఖర రెడ్డి మాట్లాడుతూ ఈ నెలాఖరుతో ముగియనున్న ఖరీఫ్ పంట కాలంలో స్వల్పకాలిక రుణాల రూపేణా రూ.3 లక్షలు, దీర్ఘకాలిక రుణాల రూపేణా యూనిట్ ఆధారంగా రూ.20 లక్షల వరకు, స్వల్పకాలికేతర రుణాలుగా పంట రుణాలు ఇచ్చేందుకు అవకాశం ఉందన్నారు. గ్రామీణ గృహ తనఖా కింద రూ.5 లక్షల వరకు, పీఎం సూర్యఘర్ పథకం కింద ఒక్కొక్కరికి రూ.3 లక్షల వరకు పరిమితి లేకుండా విరివిగా రుణాలందించాలని సింగిల్ విండోల అధ్యక్షులకు సూచించారు. ఈ రుణాల ద్వారా సంఘాలను లాభదాయక మార్గాల్లో నడిపి గ్రామీణ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు.బ్యాంకు సీఈవో శంకర్ బాబు, డీసీఏవో నారాయణమ్మ, ఏజీఎం సురేష్ బాబు, లీగల్ ఆఫీసర్ వై. గంగిరెడ్డి, 75 సింగిల్ విండోల అఫిషియల్, నాన్ అఫిషియల్ కమిటీల చైర్మన్లు పాల్గొన్నారు.

బార్ లైసెన్సుల దరఖాస్తు గడువు పెంపు

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బార్ లైసెన్సుల దరఖాస్తు గడువును పొడిగిస్తున్నట్లు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో ఐదు, పలమనేరు మున్సిపాలిటీలో ఒకటి కలిపి మొత్తం ఆరు బార్లకు దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 17వ తేదీ సాయంత్రం ఆరు గంటలవరకు గడువు పొడిగించడం జరిగిందన్నారు. 18వ తేదీ ఉదయం ఎనిమిది గంటలకు డీఆర్‌డీఏ మీటింగ్ హాల్‌లో లాటరీ ద్వారా బార్లను కేటాయించనున్నట్లు ఈఎస్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

రొంపిచెర్ల ఏఎంసీ చైర్‌పర్సన్‌గా సుజాత





సుజాత - త్యాగరాజు

పుంగనూరు, సెప్టెంబరు12(ఆంధ్రజ్యోతి):రొంపిచెర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీని ప్రభుత్వం శుక్రవారం ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కమిటీ చైర్‌పర్సన్‌గా కె.సుజాత, వైస్ చైర్మన్‌గా ఎం.త్యాగరాజుతో బాటు పాలకవర్గ డైరెక్టర్లను ఏడాది పదవీకాలంతో నియమిస్తూ నియమించింది.కల్లూరు పంచాయతీ తలారివారిపల్లెకు చెందిన బీజేపీ నాయకుడు కె.జయరామయ్య భార్య కె.సుజాతను చైర్‌పర్సన్‌గా, పులిచెర్ల మండలం బోరెడ్డిపల్లెకు చెందిన టీడీపీ నాయకుడు ఎం.త్యాగరాజును వైస్ చైర్మన్‌గా నియమించారు. డైరెక్టర్లుగా జగడం కవిత, ఎ.గిరి, డి.చెంగల్‌రెడ్డి,జె. ఈశ్వరయ్య, జి.విజయమ్మ, డి.భూదేవి,జి.లక్ష్మీనారాయణమ్మ,బి.సుబ్రహ్మణ్యం, ఎం.వెంకట్రమణ నాయుడు, జి.కవిత, సి.రెడ్డిశివ, ఇ.సుబ్బరాజు, పి.నిర్మలతో బాటు రొంపిచెర్ల సింగిల్‌విండో చైర్మన్, పుంగనూరు ఏడీ, బొమ్మయ్యగారిపల్లె పంచాయతీ ప్రత్యేకాధికారి , చిత్తూరు వ్యవసాయ మార్కెటింగ్ ఆఫీసర్లను సభ్యులుగా నియమించారు. రొంపిచెర్ల మార్కెట్ కమిటీ పరిధిలో రొంపిచెర్ల, పులిచెర్ల మండలాలు ఉంటాయి. ఈ సందర్భంగా నూతన వైస్ చైర్మన్ ఎం.త్యాగరాజు మాట్లాడుతూ తమకు పదవి రావడానికి సహకరించిన పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మార్కెట్ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

నీ కథ చూస్తా..!

● ఎంపీడీవోకు వార్నింగ్ ఇచ్చిన మహిళా పోలీసు

పెనుమూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): 'నీ కథ చూస్తా.. నన్నే అడుగుతావా' అంటూ ఎంపీడీవోకు ఓ మహిళా పోలీస్ వార్నింగ్ ఇచ్చారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గురువారం ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి సీఆర్ కండ్రిగ సచివాలయం విజిట్‌కు వెళ్లారు. ఉదయం 11 గంటలవుతున్నా సిబ్బంది కొందరు రాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంతలో సచివాలయానికి వచ్చిన మహిళా పోలీస్ శకుంతలను ఎందుకు లేట్‌గా వచ్చావ్.. నెలరోజులుగా ఇలాగే వస్తున్నట్లు రికార్డులు చెబుతున్నాయని ప్రశ్నించారు. అందుకామె.. 'ఏంటి నన్నే అడుగుతున్నావ్ నీ కథ చూస్తా ఏమనుకుంటున్నావ్' అని ఎంపీడీవోకే వార్నింగ్ ఇచ్చింది. ఎంపీడీవో వెళ్లిపోయాక ఆయనపై ఎస్‌ఐ వెంకటనరసింహంకు ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ సచివాలయంలో విచారించి పైఅధికారులతో మాట్లాడే విధానం బాగుండాలని సలహా ఇచ్చారు. అయితే శుక్రవారం తన అనుమతి లేకుండా మూవ్‌మెంట్ రాయకుండా.. పెనుమూరులో ఉండటంతో ఆమెకు షోకాజ్ నోటీసును సెక్రటరీ జారీ చేశారు.

నదీ పరివాహక ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలపై నిషేధం



ఇసుక కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నదీపరివాహక ప్రాంతా ల్లో ఇసుక తవ్వకాలను ప్రభుత్వం నిషేధించిందని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని మూడు డిపోల్లో 45,850 మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వవుందన్నారు. ఇసుక అక్రమ తవ్వకాలను నియంత్రించేందుకు రవాణా, రెవిన్యూ, గనుల శాఖలు పటిష్ఠ చర్యలు చేపట్టాలన్నారు. గతంలో ఇసుక కాంట్రాక్టర్లు జరిపిన అక్రమ తవ్వకాల గూర్చి ప్రభుత్వం అందించిన వివరాలను కమిటీలో సమీక్షించారు. ఎక్కడైనా నదీపరివాహక ప్రాంతంలో ఇసుక తవ్వకాలకు యంత్రాలను ఉపయోగించినా, అక్రమంగా పొరుగురాష్ట్రాలకు తరలించినా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎస్పీ మణికంఠ మాట్లాడుతూ ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా కార్యకలాపాలు నివారించేందుకు భూగనులశాఖ, పోలీసు శాఖ అధికారులకు బాధ్యతలు అప్పగించామన్నారు. ఈ సమావేశంలో జేసీ విద్యాధరి, మైన్స్‌శాఖ డీడీ సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ విజయ్ కుమార్, రవాణాశాఖ కమిషనర్ నిరంజన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మైన్స్ తవ్వకాల్లో అక్రమాలు సహించం

డీడీ సత్యనారాయణ



చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గనుల తవ్వకాల్లో అక్రమాలు జరిగితే సహించేది లేదని జిల్లా భూగర్భ, గనుల శాఖ డీడీ ఎస్‌కేవీ సత్యనారాయణ స్పష్టం చేశారు. అనధికారికంగా గనులు నిర్వహిస్తున్నట్లు తెలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అక్రమంగా మట్టిని తరలిస్తే సహించేది లేదన్నారు. వెదురుకుప్పం మండలం కొమరకుంట గ్రామ పంచాయతీ, బందార్లపల్లి, ఆరిమాకులపల్లిలోని క్వారీ వివాదం కోర్టులో నడుస్తున్నందున, అక్కడ ఎలాంటి పనులు చేయకుండా నిలుపుదల చేసినట్లు చెప్పారు. ఎస్ఆర్‌పురం మండలం 52 కనికాపురం కమ్మరాయలగుట్టలో పర్మిట్లు లేకుండా జరుగుతున్న తవ్వకాలపై ఇప్పటి వరకు రూ.4లక్షలు జరిమానా విధించినట్లు చెప్పారు. కార్వేటినగరం మండలం సురేంద్రనగర్ గ్రామ పంచాయతీ, తిరుమలకుప్పంలోని క్వారీ కోర్టు వివాదంలో ఉందన్నారు. విజయపురం మండలం మహారాజపురంలోని గ్రావెల్ తరలింపునకు తాత్కాలిక అనుమతులు ఇచ్చామన్నారు. పాలసముద్రం మండలం వనదుర్గాపురంలో గ్రావెల్ తరలిస్తున్న వాహనాలను సీజ్ చేసి రూ.17 వేల జరిమానా విధించామన్నారు. జాతీయ రహదారుల పనులకు అవసరమైన మేరకు మట్టిని తరలించుకునే వెసులుబాటు ఉందని, అయితే దానికి అవసరమైన పర్మిట్లు తీసుకోవాలని సూచించారు.



సత్యపాల్ సింగ్ బాగల్ - జస్టిస్ అవినాష్ జింగన్ - అనిరూధ్ - సప్తగిరి - సుధా

శ్రీవారిసేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వీరిలో కేంద్రమంత్రి సత్యపాల్‌సింగ్ బాగల్, రాజస్థాన్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అవినాష్ జింగన్, రాజస్థాన్ మంత్రి కన్హయ్య లాల్ చౌదరి, జార్ఖండ్ మాజీ సీఎం సర్యూరాయ్, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి ఉన్నారు. ఇంకా సంగీత దర్శకుడు అనిరుధ్, నటి సుధా, నటుడు సప్తగిరి కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

17న తైక్వాండో క్రీడాకారుల ఎంపిక

తిరుపతి(క్రీడలు), సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీనివాస క్రీడా సముదాయంలో ఈ నెల 17న అండర్ 14, 17, 19 బాలబాలికల తైక్వాండో, స్విమ్మింగ్ జిల్లాస్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు స్కూల్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శులు కిషోర్‌కుమార్, భార్గవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుకున్న వారు అర్హులని, ఆసక్తిగల బాలబాలికలు సొంత క్రీడా సామగ్రితో హాజరుకావాలని కోరారు. హెచ్ఎం నుంచి వయస్సు ధ్రువీకరణ పత్రం, ఇంటర్ చదువుతున్న విద్యార్థులు పదవ తరగతి ఒరిజినల్ మార్కులిస్టుతో రావాల్సి ఉంటుందని వివరించారు. మరిన్ని వివరాలకు 8121777077(స్విమ్మింగ్), 9032956111 (తైక్వాండో)లను సంప్రదించాలని కోరారు.

సర్వదర్శనానికి 14 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ కృష్ణతేజ విశ్రాంతి భవనం మీదుగా శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.3.81 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 66,312

తలనీలాలు సమర్పించినవారు: 27,728

గుడి తాళాలకీ, బండి తాళాలకీ

తేడా తెలీదా భూమనా?

- టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి



భానుప్రకాష్‌రెడ్డి

తిరుమల, సెప్టెంబరు12(ఆంధ్రజ్యోతి): 'ఏందయ్యా కరుణాకర్‌రెడ్డి గారు.. గతంలో రెండు సార్లు టీటీడీ చైర్మన్‌గా పనిచేశారు. మూడుసార్లు సభ్యుడిగా ఉన్నారు. బండి తాళాలకు, గుడి తాళాలకు తేడా కూడా తెలియదా మీకు?' అంటూ టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి ప్రశ్నించారు. తిరుమల శ్రీవారి ఆలయం ముందు శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ, చంద్రగ్రహణం రోజున మహద్వారం గేట్‌కు టీటీడీ సిబ్బంది తాళాలు వేస్తే చైర్మన్ సైన్యం చేతిలో తాళాలున్నాయని అబద్దాలు ప్రచారం చేశారని చెప్పారు.టీవీ5 రిపోర్టర్ బండి తాళాలు పట్టుకుని మహద్వారం వద్ద ఫొటో దిగితే మహద్వారం గేటు తాళాలని అబద్ధాలు ప్రచారం చేశారు. మరి సాక్షి రిపోర్టరు కూడా అలానే ఫొటో దిగారు అది కనిపించలేదా కరుణాకర్‌రెడ్డీ అని నిలదీశారు. టీటీడీపై అసత్య, అబద్ధపు ప్రచారాలు చేసినా, ఫేక్ న్యూస్‌లు వేసినా క్రిమినల్ కేసులు పెట్టేలా రానున్న బోర్డు సమావేశంలో తీర్మానం చేస్తామని భానుప్రకాష్‌రెడ్డి తెలిపారు.

తిరుమలలో దొంగ దొరికాడు

- 15 సెల్‌ఫోన్లు, 20 గ్రాముల బంగారు స్వాధీనం



పోలీసుల అదుపులో కిషోర్‌రెడ్డి, స్వాధీనపరుచుకున్న బంగారు, సెల్‌ఫోన్లు

తిరుమల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): భక్తుల నుంచి సెల్‌ఫోన్లు, బంగారు ఆభరణాలు కొట్టేసే దొంగను తిరుమల పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి 15 సెల్‌ఫోన్లు, 20గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనపరుచుకున్నారు. తెలంగాణలోని నల్గొండ జిల్లా, పాత సూర్యాపేటకు చెందిన మెట్టు కిషోర్‌రెడ్డి కొంతకాలంగా తిరుమలను కేంద్రం చేసుకుని చోరీలకు పాల్పడుతున్నట్టు పోలీసులు గుర్తించారు. ఇతను గత నెలలో సీ టైప్ కార్వర్స్‌లోనూ ఇంటి తాళాలు పగలగొట్టి 20 గ్రాముల బంగారు ఆభరణాలతో పాటు రూ.40 వేల నగదు అపహరించినట్టు విచారణలో వెల్లడైంది. కిషోర్‌రెడ్డిని జ్యుడీషియల్ రిమాండ్ కోసం తిరుపతికి పంపారు.

ఇసుక అక్రమ రవాణాకు మైనర్లు

- పట్టించుకోని అధికారులు

రేణిగుంట, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలంలోని స్వర్ణముఖి నది తీర ప్రాంతం నుంచి ఇసుకను యథేచ్ఛగా దోచుకోవడమే కాకుండా మైనర్లని ట్రాక్టర్ డ్రైవర్లుగా వినియోగించడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. స్వర్ణముఖి నది తీర ప్రాంతంలోని జీపాళెం, పిల్లపాళెం, తాతయ్యకాలవ, గాజులమండ్యం, పన్నీరుకాలువ, కొత్త మంగళం పరిసరాల్లో స్వర్ణముఖి నది తీరంతో పాటు, ప్రైవేటు భూముల్లో ఇసుకను అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇటీవల పోటీతత్వంతో అధిక మొత్తంలో ఇసుకను రవాణా చేయాలని దురుద్దేశంతో కొంతమంది ఇసుకాసురులు ఏకంగా మైనర్లను కనీసం లైసెన్స్ లేకుండా ఇసుక అక్రమ రవాణాకు డ్రైవర్లుగా వినియోగిస్తున్నారు. రోడ్లపై జరగరానిది జరిగితే బాధ్యత ఎవరు వహిస్తారని స్థానిక ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా మైనింగ్, రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు స్పందించి బాలురతో ఇసుక రవాణా చేస్తున్న ఇసకాసురులపై చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఈ విషయంపై డీఎస్పీ శ్రీనివాసరావుని వివరణ కోరగా రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా మైనర్లతో ఇసుక ట్రాక్టర్లను తోలిస్తే ఎక్కడికక్కడ వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

ఎంత కాలం విచారిస్తారో!



కాల్వ వంకలో నిర్మించిన రేకుల షెడ్డు, రూమ్..

రేణిగుంట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మా దృష్టికి రాలేదు. విచారించి చర్యలు తీసుకుంటాం. ఇదీ ఆక్రమణలపై రెవెన్యూ అధికారుల స్టాక్ డైలాగ్. ఎంతకాలం విచారిస్తారో కానీ.. ఆ ఆక్రమణ స్థలాల్లో నిర్మాణాలూ జరిగిపోతుంటాయి. ఇలాంటిదే రేణిగుంట మండలం గాజులమండ్యం పంచాయతీ నీలసానిపేటలో చోటుచేసుకుంది. ఇక్కడి సర్వేనెం.1147లో కాలువ వంక 2.84ఎకరాల్లో విస్తీర్ణంలో ఉంది. గతంలో ఈ కాల్వ వంకలో సేద్యం చేస్తుండే వారు. ఆ తర్వాత రాత్రికి రాత్రే ఆ భూమిలో షెడ్ వెలిసింది. ఇందులో నిర్మాణాలు చేపడుతున్నట్టు ఇటీవల జరిగిన మండల సర్వసభ సమావేశంలో ప్రజా ప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. చర్యలు తీసుకుంటామని ఆ సమావేశంలో రెవెన్యూ అధికారే చెప్పారు. కానీ ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదు. ఆ తర్వాత ఆక్రమణదారులు ఇళ్ల నిర్మాణానికి గుంతలు తవ్వారు. ఇలా చూస్తుండగానే ఇంటి నిర్మాణమూ పూర్తయ్యేలా ఉందే కానీ.. అధికారులు చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు మండిపడుతున్నారు.



పక్కనే ఇంటి నిర్మాణానికి తవ్విన గుంతలు

స్కిట్‌లో తరగతుల ప్రారంభానికి సన్నద్ధం



స్కిట్ కళాశాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, వైస్ ఛాన్స్‌లర్

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూతో అనుబంధంగా స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలలో తరగతులు త్వరలో ప్రారంభించడానికి సర్వం సన్నద్ధం చేస్తున్నామని ఎమ్మెల్యే సుధీర్, అనంతపురం జేఎన్‌టీయూ వైస్ ఛాన్స్‌లర్ సుదర్శన్‌రావు సంయుక్తంగా తెలిపారు. నాలుగేళ్ల క్రితం మూతపడిన స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలను తెరిపిస్తామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీలో భాగంగా గత నెలలో ఆ ప్రక్రియ పూర్తి చేసిన విషయం తెలిసిందే. రెండో విడత ఏఈఏపీసెట్ కౌన్సెలింగ్‌లో భాగంగా స్కిట్ కళాశాలలో అడ్మిషన్ల కోసం వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. అలాగే మూడో విడత కౌన్సెలింగ్‌లో భాగంగా మళ్లీ ఇదే కళాశాలలో విద్యార్థులు అడ్మిషన్లు పొందేందుకు అవకాశం కల్పించారు. శుక్రవారం ఎమ్మెల్యే, జేఎన్‌టీయూ వీసీ కళాశాలను సంయుక్తంగా పరిశీలించారు. మొదటి సంవత్సరం నిర్వహణ కోసం యుద్ధప్రాదికన సిద్ధం చేస్తున్న తరగతి గదులు, డిజిటల్, కంప్యూటర్ ల్యాబ్‌లను పరిశీలించారు. ముక్కంటి ఆలయం సహాయంతో విద్యార్థులకు వసతి సదుపాయం కల్పిస్తున్న అంశంపై ఆరా తీసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలో మూడో విడత కౌన్సెలింగ్ ముగిసిన వెంటనే తరగతి గదులు ప్రారంభమవుతాయన్నారు. స్థానిక విద్యార్థులు మూడో విడత కౌన్సిలింగ్‌లో అడ్మిషన్లు పొందే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దేవేంద్రరెడ్డి, టీడీపీ నాయకులు చెంచయ్యనాయుడు, మోహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- కేంద్ర మంత్రి ఎస్పీ సింగ్ బాఘేల్



శ్రీజ డెయిరీని పరిశీలిస్తున్న మంత్రి ఎస్పీ సింగ్ బాఘేల్

చంద్రగిరి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆర్థిక లబ్ధికోసం మహిళలు పాల ఉత్పత్తి మాత్రమే కాకుండా కోళ్ల పెంపకం, చేపల సాగు, పందుల పెంపకం వంటి రంగాలలోనూ రాణించాలని కేంద్ర మత్స్య, పశుసంవర్థక, పాడి పరిశ్రమ శాఖ సహాయ మంత్రి ఎస్పీ సింగ్ భాఘేల్ సూచించారు. చంద్రగిరి మండలం మల్లయ్యపల్లెలోని శ్రీజ డెయిరీ మహిళా పాల ఉత్పత్తిదారుల సంస్థను గురువారం ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ఆయన శ్రీజలో సంస్థలో ఉన్న మహిళా పాడి ఉత్పత్తిదారులతో సంభాషించారు. సంస్థ నిర్వహణ విధివిధానాలను పరిశీలించారు. పాల ఉత్పత్తిదారులతో శ్రీజ సంస్థ అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్, డెయిరీ సర్వీసెస్ శ్రీజ సంస్థకు అందిస్తున్న సహకారాన్ని అడిగి తెలుసుకున్నారు. దేశంలోనే డెయిరీ రంగ అభివృద్ధిలో శ్రీజ సంస్థ భాగస్వామ్యాన్ని ఆయన ప్రశంసించారు. పంచాయితీ రాజ్ వ్యవస్థల ద్వారా అనేక గ్రామీణ అభివృద్ధి కార్యక్రమాల్లో మహిళల చురుకైన పాత్ర పోషించాలని తెలియజేశారు. అనంతరం మహిళా పాల ఉత్పత్తిదారులను లాఖ్‌పతి దిదీస్‌లను ఎంపిక చేసి మంత్రి ఘనంగా సత్కరించారు. తర్వాత మల్లయ్యపల్లె టీడీపీ నాయకుడు బీగాల మహేష్ రాయల్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు కేంద్రమంత్రిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీజ కంపెనీ సీఈఓ తిమ్మప్ప, హెడ్ రాజేంద్రబాబు, పీఐబీ హెడ్ నిశాంత్, తిరుపతి ఏరియా మేనేజర్ రమేష్, పీఐబీ మోహన్, తహసీల్దార్ శివరామసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

'మెడికల్ డైలాగ్స్'లో ఆంధ్రజ్యోతి కథనం

తిరుపతి, సెప్టెంబరు12(ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్య రంగానికి సంబంధించి జాతీయస్థాయిలో విశ్వసనీయత కలిగిన 'మెడికల్ డైలాగ్స్' వెబ్ న్యూస్‌లో నిబంధనలు పాటించని స్విమ్స్ నోటిఫికేషన్ అంశాన్ని ప్రస్తావిస్తూ శుక్రవారం ఓ కథనం రాసుకొచ్చింది. ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో 'చదువు చెప్పిన చోటే వద్దంటోంది' శీర్షిన ప్రచురితమైన వార్తను ఉటంకించింది. అదేవిధంగా డెంటిస్ట్రీ పోస్టును మార్చిన తీరును ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన అంశాన్నీ ప్రస్తావించింది. మెడికల్ డైలాగ్స్ నుంచి వార్తాంశాలను వైద్య, ఆరోగ్య రంగం కీలకంగా పరిగణిస్తుంటోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌వో) కూడా సదరు వెబ్‌సైట్‌లోని అంశాలను అనుసరిస్తుంటోందని వైద్య వర్గాలు చెబుతున్నాయి. స్విమ్స్ నోటిఫికేషన్ లోపాలను స్థానిక మీడియా కథనాలు ప్రచురిస్తోందని మెడికల్ డైలాగ్స్ తన కథనంలో పేర్కొంది. వైద్య అభ్యర్థులు సదరు వెబ్ లింక్‌ను వైరల్ చేస్తే తమ వెతలను వెలుగులోకి తెచ్చిన ఆంధ్రజ్యోతికి ధన్యవాదాలు చెబుతున్నారు.

తల్లీ కూతుళ్ల కిడ్నాప్

- నిందితులపై కేసు నమోదు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇక, వివాహేతర సంబంధం మానేద్దామన్న వివాహితను బెదిరించాడు. ఆమెను, ఆమె తల్లిని కిడ్నాప్ చేసి దాడికి పాల్పడ్డాడు. బాధితుల ఫిర్యాదు మేరకు నిందితులపై కిడ్నాప్, హత్యాయత్నం కింద ఈస్ట్ పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు కథనం మేరకు.. తిరుపతికి చెందిన ఓ వివాహిత ఇంటి వద్ద టైలరింగ్ పనులు చేస్తోంది. ఈమె భర్త సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. ఈ క్రమంలో కొర్లగుంటలోని అజీమ్‌తో ఈమెకు వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ విషయం ఎక్కడ ఇంట్లో తెలిసిపోతేందనే ఆలోచనతో ఆమె సంబంధం తెంచుకోవాలని అజీమ్‌కు చెప్పింది. దీనికి అతడు అంగీకరించలేదు. ఈ క్రమంలో లక్ష్మీపురం సర్కిల్‌లోని జిమ్ వద్దకు రావాలని ఆ మహిళ, ఆమె తల్లికి ఫోను చేశాడు. డ్రైవర్ బబ్లూతో కలిసి వారిని బలవంతంగా కారులో తీసుకెళ్లాడు. తన ప్రేమ కాదంటే ఇద్దరినీ చంపితగుల బెడతానని బెదిరించి దాడి చేశాడు. దీనిపై బాధితులు 112కు ఫోన్ చేసి తమను కిడ్నాపర్ల బారి నుంచి కాపాడాలని పోలీసులను వేడుకున్నారు. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు తమ సిబ్బందితో కలసి ఘటనా స్థలికి చేరుకుని వారి ఆచూకీ కోసం గాలించారు. అజీమ్ వాడుతున్న మొబైల్ నెంబరు ఆధారంగా వారిని గుర్తించి లక్ష్మీపురం సర్కిల్ వద్ద మాటు వేసి పట్టుకున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుల కోసం గాలిస్తున్నట్లు ఆయన చెప్పారు.

యాంకర్ హబ్‌గా తిరుపతి

జాతీయ, అంతర్జాతీయ పర్యాటకుల గమ్యస్థానంగా తిరుపతిని తీర్చిదిద్దుతాం

ప్రాంతీయ పెట్టుబడిదారుల సమావేశంలో మంత్రి దుర్గేష్



జ్యోతి వెలిగించి సదస్సును ప్రారంభిస్తున్న మంత్రి దుర్గేష్

తిరుపతి(విద్య), సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): 'పెట్టుబడులతో రండి. పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేద్దాం. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సృష్టిద్దాం' అంటూ ఇన్వెస్టర్లకు రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు. తిరుపతిలో శుక్రవారం జరిగిన ప్రాంతీయ పెట్టుబడిదారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాయలసీమ, తిరుపతిల్లో పర్యాటకరంగ అభివృద్ధికి సంబంధించి ప్రణాళికను వివరించారు. తిరుపతిని మైస్ టూరిజం సెంటర్‌గా, ఓ యాంకర్ హబ్‌గా తీర్చిదిద్దనున్నట్టు చెప్పారు. శ్రీవారి దర్శనార్థం తిరుపతికి వచ్చే భక్తులు రెండు మూడు రోజులు ఇక్కడే ఉండి ఇతర పర్యాటక ప్రాంతాలను సందర్శించేలా ప్రణాళిక రూపొందించామన్నారు. దీనికోసం చంద్రగిరి కోట, ఎస్వీ జూపార్కు, తలకోన, సూళ్లూరుపేట, నేలపట్టులోని పక్షుల విహార కేంద్రాలను కలుపుతూ టూరిజం సర్క్యూట్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ క్రమంలో పర్యాటకుల వసతికి అవసరమైన స్టార్ హోటళ్లు, రిసార్టులు, కాటేజీల నిర్మాణం చేపడుతున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అంచనా మేరకు క్యారవాన్ టూరిజంకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. శేషాచలం అడవుల్లో అడ్వెంచర్ టూరిజం, వాటర్ స్పోర్ట్స్ ట్రెక్కింగ్ తదితర ప్రక్రియను ప్రవేశపెడితే బాగుంటుందని ఆలోచిస్తున్నట్టు చెప్పారు. ఎర్రచందనం లభిస్తున్న ఈ ప్రాంతంలో ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఏర్పాటుకు ప్రణాళిక చేస్తున్నామన్నారు. తిరుపతి ప్రాంతంలో అటవీ, దేవదాయ, ఇరిగేషన్ శాఖలతో సమన్వయం చేసుకుంటూ ఎకో టూరిజం అభివృద్ధికి ఇప్పటికే కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. కోనసీమలోని మండువాల తరహాలో తిరుపతిలో పాతకాలం నాటి ఇళ్లలో, పురాతన కట్టడాలలో హోమ్‌స్టేలు ఏర్పాటు చేస్తామన్నారు. స్పష్టమైన ప్రతిపాదనలతో, ఆలోచనతో పర్యాటక అభివృద్ధికి ముందుకొచ్చే ఇన్వెస్టర్లకు ప్రభుత్వం అవసరమైన భూమి, రాయితీలు, ప్రోత్సాహం అందిస్తుందని మంత్రి దుర్గేష్ హామీ ఇచ్చారు. సింగిల్ విండో విధానం ద్వారా అనుమతులు త్వరితగతిన జారీ చేస్తామన్నారు. ఇన్వెస్టర్లపై భారం పడకుండా చర్యలు తీసుకుంటామన్నారు. హోమ్‌స్టేలు, పర్యాటక పాలసీకి సంబంధించిన మార్గదర్శకాలను ఏపీటీడీసీ ఎండీ ఆమ్రపాలి వివరించారు. పెట్టుబడిదారులకు ఏ ఇబ్బంది వచ్చినా తాను పరిష్కరిస్తానని, అనుమతుల మంజూరు తదితరాల విషయంలో అండగా ఉంటానని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ, టూరిజం స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్, కలెక్టర్ వెంకటేశ్వర్, నరసింహ యాదవ్, సుగుణమ్మ, పసుపులేటి హరిప్రసాద్, టూర్ ఆపరేటర్స్ అసోయేషన్ అధ్యక్షుడు విజయ్ మోహన్, సీఐఐ దామోదర నాయుడు, ఔత్సాహిక ఇన్వెస్టర్లు పాల్గొన్నారు.

- *తిరుపతిని వ్యూహాత్మక పర్యాటక ప్రదేశంగా ప్రభుత్వం భావిస్తోంది. తిరుపతి మొదలు సమీప ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు పర్యాటక పెట్టుబడిదారులను ప్రభుత్వం ఆహ్వానిస్తోంది. అందులో భాగంగా స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు (ఎస్ఐపీబీ) ద్వారా రూ3,482 కోట్ల విలువైన హాస్పిటాలిటీ ప్రాజెక్టులకు కేబినెట్‌లో ఆమోదం లభించింది. తద్వారా హోటళ్లలో 2,698 గదుల ఏర్పాటుకు అవకాశం ఉంది. సుమారు 11,645 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.*

- తిరుపతి సమీపంలో అట్మాస్పియర్, నోవాటెల్, మారియట్, ఒబెరాయ్, లెమన్ ట్రీ, మహేంద్ర తదితర సంస్థలతో రిసార్ట్స్, హోటళ్లు నిర్మించేందుకు ఎంవోయూలు చేసుకున్నాం. దుబాయ్ తరహాలో మీటింగ్, ఇన్సెంటివ్ కాన్ఫరెన్సులు, ఎగ్జిబిషన్ (మైస్) టూరిజంను అభివృద్ధి చేస్తాం.

- తహసీల్దారు కార్యాలయంలో

వీరంగం సృష్టించిన వ్యక్తిపై కేసు

రామచంద్రాపురం,సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): రామచంద్రాపురం తహసీల్దారు కార్యాలయంలో వీరంగం సృష్టించి, అధికారులను దుర్భాషలాడిన పురుషోత్తంరెడ్డిపై కేసు ననమోదైంది. తహసీల్దారు మధుసూదన్‌రావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. రెవెన్యూ అధికారుల కథనం మేరకు .. తన భార్య ఆధార్ కార్డులో అడ్రసు మార్పు కోసం వేపకుప్పం గ్రామానికి చెందిన పురుషోత్తంరెడ్డి ఆధార్ అప్లికేషన్‌లో గెజిటెడ్ ఆఫీసర్ సంతకం కోసం ఈనెల 6న తహసీల్దారు కార్యాలయానికి వచ్చారు. తహసీల్దారు తన చాంబర్‌లో ప్రజా సమస్యలపై ఫిర్యాదు స్వీకరిస్తుండగా కాసేపు వేచి ఉండాలని పురుషోత్తంరెడ్డికి సిబ్బంది చెప్పారు. తాను ఎందుకు బయట వెయిట్ చేయాలంటూ ఆయన తహసీల్దారు చాంబర్‌లోకి వెళ్లి దరఖాస్తుపై సంతకం పెట్టాలని కోరారు. ఆధార్ కార్డులో తిరుపతి రూరల్ మండలం అని ఉండటంతో అక్కడి తహసీల్దారు చేత సంతకం చేయించుకోవాలని సూచించారు. దీంతో కోపోద్రిక్తుడైన పురుషోత్తంరెడ్డి 'నువ్వు పబ్లిక్ సర్వెంట్. సంతకం ఎందుకు పెట్టవు. మేముచెప్పిన చోట సంతకం పెట్టాలి. నీ కథ చూస్తా. కలెక్టర్‌కు నీపై ఫిర్యాదుచేస్తా' అంటూ దుర్భాషలాడుతూ దౌర్జన్యానికి పాల్పడ్డారు. ఇంతలో గ్రామ రెవన్యూ అసిస్టెంట్లు మోహన్, గంగయ్య, గీత వారించినా వినలేదు. సిబ్బందిపైనా దుర్భాషలాడారు. దీంతో విధులకు ఆటంకం కలిగించి తమపై దౌర్జన్యానికి పాల్పడ్డాని తహసీల్దారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లా సామాజిక అటవీ విభాగం

- డీఎఫ్‌వోగా పవన్‌కుమార్‌రావు

మంగళం, సెప్టెంబరు12(ఆంధ్రజ్యోతి): జిల్లా సామాజిక అటవీ సామాజిక విభాగం డీఎఫ్‌వోగా జీఎన్ పవన్‌కుమార్ నియమితులయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు హోదాలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న అధికారులకు పదోన్నతులు కల్పిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. అందులో భాగంగా తిరుపతి బయోట్రిమ్‌లో డీఎసీఎఫ్‌గా పనిచేస్తున్న ఆయన డీఎఫ్‌వోగా నియమితులయ్యారు. అలాగే తిరుపతి ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వోగా ఉన్న శ్రీనివాసులు సత్యసాయి జిల్లా సోషల్ ఫారెస్టు డీఎఫ్‌వోగా బదిలీ అయ్యారు. తిరుపతి ఎస్వీ జంతు ప్రదర్శనశాల డీసీఎఫ్‌గా, తిరుపతి సబ్ డీఎఫ్‌వోగా ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్న నాగభూషణంను మంగళగిరి పీసీసీఎఫ్ కార్యాలయం డీసీఎఫ్‌గా బదిలీ చేశారు.

రూ.69.30లక్షలతో మూడు ల్యాబ్‌లు



ఏర్పేడు జడ్పీ ఉన్నత పాఠశాల

ఏర్పేడు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఏర్పేడులోని జడ్పీఉన్నత పాఠశాలలో మూడు ల్యాబ్‌లు ఏర్పాటు కానున్నాయి. ఒక్కో ల్యాబ్‌కు రూ.23.10లక్షలు మంజూరయ్యాయి. సైన్స్ ల్యాబ్, రెండు ఆటిజం సెంటర్లు రెండు ఏర్పాటు కానున్నాయి. సైన్స్ ల్యాబ్ ఏర్పాటుతో విద్యార్థులే సైన్స్‌లె మరింత పట్టుసాధించవచ్చు. గత ఐదేళ్లలో ఈ సెంటర్లు కావాలని ఉపాధ్యాయులు పదే పదే జిల్లా స్థాయి అధికారులకు ప్రతిపాదనలు పంపినప్పటికీ గత ప్రభుత్వంలో మంజూరు కాలేదు.

22 నుంచి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు

తిరుచానూరు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో ఈ నెల 22వ తేదీ నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు నవరాత్రి ఉత్సవాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ప్రతిరోజూ మధ్యాహ్నం 3 నుంచి 4.30గంటల వరకు ఆలయంలోని శ్రీకృష్ణస్వామి ముఖమండపం వద్ద పద్మావతి అమ్మవారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహిస్తారు. సాయంత్రం ఊంజల్‌సేవ నిర్వహిస్తారు. అక్టోబరు 2వ తేదీ విజయదశమినాడు రాత్రి 7.45గంటలకు పద్మావతి అమ్మవారు గజవాహనంపై ఊరేగి భక్తులకు దర్శనమిస్తారు. **ఆర్జిత సేవలు రద్దు** : నవరాత్రి ఉత్సవాల కారణంగా ఆలయంలో ఈ పదిరోజుల పాటు కల్యాణోత్సవ సేవను రద్దు చేశారు. అదే విధంగా సెప్టెంబరు 26న లక్ష్మీపూజ సేవలు రద్దు చేశారు.

ఎంత పెద్ద కంటైనర్లో..!



ఒక దాని వెనుక మరొకటి. ఇలా ఐదు భారీ కంటైనర్లు రేణిగుంట మండలం రామకృష్ణాపురం కూడలి సమీపంలో రోడ్డు పక్కన శుక్రవారం ఆపారు. తమిళనాడు రాష్ట్రం వేలూరు నుంచి అనంతపురం జిల్లా తాడిపత్రికి గాలి ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసే పరికరాలను తరలిస్తున్న ఈ కంటైనర్లు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇక్కడే నిలిపేశారు. భారీ వాహనాలు కావడంతో పగటిపూట వెళ్తే రాకపోకలకు అంతరాయం కలిగే అవకాశం ఉండడంతో రాత్రి 10 గంటల తర్వాత బయలుదేరాయి.

- రేణిగుంట ఆంధ్రజ్యోతి

మండలానికి 500 సూర్యఘర్ కనెక్షన్లు

● ఏర్పాటు చేసుకునేలా చూడాలన్న ఎస్ఈ



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పీఎం సూర్యఘర్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ ఆదేశించారు. శుక్రవారం గాంధీరోడ్డులో చిత్తూరు ఆపరేషన్ డివిజన్ విద్యుత్ శాఖ కార్యాలయంలో ఈ అంశంపై సమీక్షించారు. ప్రతి మండలానికి 500 కనెక్షన్లు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకునేలా ఏఈలు చర్యలు తీసుకోవాలన్నారు. ముందుగా నెలకు 300 యూనిట్లు దాటిన ఓసీ, బీసీ వినియోగదారులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. బీసీలకు ప్రభుత్వం అదనంగా రూ.20వేల సబ్సిడీ ఇస్తోందనే విషయాన్ని తెలియజేసి, మోటివేట్ చేయాలన్నారు. అలాగే ఎస్సీ ఎస్టీలకు 200 యూనిట్ల వరకు మాత్రమే ప్రభుత్వం ఉచిత విద్యుత్‌ను అందిస్తోందని తెలిపారు. కొందరు 200 యూనిట్లకుపైగా వాడుతూ.. అదనంగా వాడిన యూనిట్లకు డబ్బులు చెల్లించడం లేదన్నారు. అలాంటి వారికి అవగాహన కల్పించి, బిల్లులు చెల్లించేలా చేయాలన్నారు.అలా కాకుండా బిల్లు కట్టలేదని మీటర్లు తొలగిస్తే వారు విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నారని, ఇది సంస్థకు నష్టం కలగజేస్తుందని వివరించారు. పెండింగ్‌లో ఉన్న వర్క్ ఆర్డర్లను పూర్తి చేయకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. వ్యవసాయ సర్వీసులను సకాలంలో మంజూరు చేయాలని, రైతులను ఇబ్బంది పెట్టొద్దని చెప్పారు. ఈ సమావేశంలో ఈఈ మునిచంద్ర, డీఈ ఆనంద్, ప్రసాద్, ఏఈలు పాల్గొన్నారు.

కొత్త సాంకేతిక సవాళ్లే అజెండా

● రేపు,ఎల్లుండి తిరుపతిలో మహిళా సాధికారత సదస్సు

తిరుపతి (కలెక్టరేట్), సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): 'కొత్త సాంకేతిక సవాళ్లను ఎదుర్కొనేందుకు మహిళల సాధికారత' అంశాన్ని అజెండాగా తీసుకుని తిరుపతిలో ఆది, సోమవారాల్లో జాతీయ మహిళా సాధికారత సదస్సు జరగనుంది. లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా నేతృత్వంలో జరిగే ఈ సదస్సులో 'వికసిత్‌భారత్ కోసం మహిళల అభివృద్ధి, జెండర్ రెస్పాన్సివ్ బడ్జెటింగ్ అంశాలకూ ప్రాధాన్యం ఇవ్వనున్నారు.పార్లమెంటుతో పాటు వివిధ రాష్ట్రాల అసెంబ్లీల నుంచీ దాదాపు 250 మంది మహిళా ప్రజాప్రతినిధులు హాజరు కానున్నారు.లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా, రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్, శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, రాష్ట్ర మంత్రులు, లోక్‌సభ కమిటీ ఛైర్‌పర్సన్ పురందేశ్వరి, రాష్ట్ర కమిటీ ఛైర్‌పర్సన్ గౌరు చరితారెడ్డి. ముఖ్యఅతిథిగా సీఎం చంద్రబాబు హాజరవుతారు. 15న జరిగే ముగింపు కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరవుతారని శాసనవ్యవస్థ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ మీడియాకు తెలిపారు.

నేడు స్పీకర్ల రాక,రేపు చంద్రబాబు

సదస్సులో పాల్గొనే పలువురు ప్రముఖులు శనివారం సాయంత్రానికే తిరుపతికి చేరుకోనున్నారు. లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ నారాయణసింగ్, అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు రాష్ట్ర మంత్రులు గుమ్మడి సంధ్యారాణి, సవిత, పయ్యావుల కేశవ్ తదితరులు నేడు తిరుపతికి రానున్నారు. సీఎం చంద్రబాబు ఆదివారం ఉదయం తిరుపతికి చేరుకుంటారు. శ్రీకన్వెన్షన్ సెంటర్‌లో జరిగే విట్ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు విశ్వనాథం మనవరాలు కాదంబరి వివాహానికి ఉదయం 9గంటలకు హాజరవుతారు.అనంతరం రాహుల్ కన్వెన్షన్ సెంటర్‌కు చేరుకుని మహిళసాధికారత సదస్సు ప్రారంభకార్యక్రమంలో పాల్గొంటారు.

సంప్రదాయ దుస్తుల్లో హాజరు కండి

రెండు రోజుల పాటు జరగనున్న జాతీయ మహిళా సాధికారత సదస్సుకు సంప్రదాయ దుస్తుల్లో విధులు నిర్వర్తించాలని అధికారులకు కలెక్టర్ వెంకటేశ్వర్ దిశా నిర్దేశం చేశారు. తిరుపతి కలెక్టరేట్‌లో శుక్రవారం విధులు కేటాయించిన నోడల్, లైజన్ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సదస్సుకు దేశవ్యాప్తంగా మహిళా ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరవుతున్నట్లు చెప్పారు. నోడల్ అధికారులే కాకుండా ప్రతి రాష్ట్రానికి సూపర్‌వైజింగ్ నోడల్ అధికారులను నియమించామన్నారు. అతిథులు వచ్చినప్పటి నుంచి తిరిగి వెళ్లేంత వరకు అధికారులు తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. లైజన్ అధికారులు అతిథులకు స్వాగతం నుంచి బస ఏర్పాటు చేసిన చోటు వరకు జాగ్రత్తగా చేరుకునేలా చూడాలన్నారు. పోలీసు శాఖ బందోబస్తు ఏర్పాట్లను జాగ్రత్తగా ఏర్పాటు చేయాలన్నారు. అతిథులకు తిరుమల, తిరుపతి, శ్రీకాళహస్తి దర్శనాలకు సంబంధించిన ఏర్పాట్లు చూసుకోవాలన్నారు. డెలిగేట్లు బస చేసే హోటళ్ల వద్ద అంబులెన్సు, వైద్యసిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. జిల్లా యంత్రాంగం సమన్వయంతో జాతీయ మహిళా సాధికారత సదస్సును విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు.



రాహుల్ కన్వెన్షన్ సెంటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ తదితరులు

స్పీకర్ ఓంబిర్లా ఆలోచనతో కొత్త ఒరవడికి శ్రీకారం

తిరుపతి(జీవకోన), సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా ఆలోచనతో కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టినట్లు శాసనసభ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ తెలిపారు. తిరుపతిలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'పార్లమెంట్‌లో మహిళ స్వశక్తీకరణ కమిటీలో 20మంది లోక్‌సభ, పదిమంది రాజ్యసభ సభ్యులు ఉంటారు. లోక్‌సభ సభ్యుల్లో ఒకరు ఛైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారు. ప్రస్తుతం దగ్గుబాటి పురందేశ్వరి ఈ కమిటీకి ఛైర్‌పర్సన్. ఇలాంటి కమిటీలే అన్ని రాష్ట్రాల శాసనసభలు, శాసనమండలిలలో ఉంటాయి. గతంలో ఏ కమిటీకి ఆ కమిటీ.. ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం.. పనిచేసుకునేవి. ఆ విధానానికి స్వస్తి పలికి, అన్ని రాష్ట్రాలలో జరిగే విషయాలను అందరూ తెలుసుకోవాలన్న ఉద్దేశ్యంతో లోక్‌సభ స్పీకర్ తీసుకున్న చొరవతో జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్నారు. మన రాష్ట్రంలో నిర్వహించే ఈ సదస్సు మూడోది. ప్రతి రాష్ట్రం నుంచి వచ్చే ప్రతినిధులు ప్రధానాంశాలపై చర్చిస్తారు' అని ఆయన వివరించారు.

ఇద్దరు వాహన దొంగల అరెస్టు

3.50 లక్షల విలువైన ఏడు వాహనాల స్వాధీనం



నిందితులను మీడియాకు చూపిస్తున్న సీఐలు మహేశ్వర, నెట్టికంఠయ్య తదితరులు

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాలను చోరీచేసే ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను అరెస్టు చేశారు. వారి నుంచి 3.50 లక్షల విలువైన ఏడు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వివరాలను శుక్రవారం రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సీఐ నెట్టికంఠయ్య ఒకటో పట్టణ సీఐ మహేశ్వర, ఎస్ఐ రమేష్‌బాబుతో కలిసి మీడియాకు తెలిపారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు చిత్తూరు నగరంతో పాటు వివిధ ప్రాంతాల్లో ద్విచక్రవాహనాలు చోరీ కావడంపై బాధితులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దొంగలను పట్టుకోవడానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించారు. ఈ క్రమంలో ఒకటి, రెండో పట్టణ పోలీసుస్టేషన్ల సిబ్బంది వేలూరు రోడ్డులోని డీఆర్‌డీఏ ఆఫీస్ ఎదురుగా వాహన తనిఖీలు చేపట్టారు. తమిళనాడు రాష్ట్రం వేలూరు జిల్లా తోటపాళ్యం పాలేటమ్మ కోవెల స్ట్రీట్‌కు చెందిన ఏసుదాస్(26), సత్తువాచ్చారి వీవోసీ నగర్‌కు చెందిన లోకనాథన్(18)లను అనుమానంతో పట్టుకోగా మరో నిందితుడు సయ్యద్ నస్రుల్లా తప్పించుకున్నాడు. అదుపులోకి తీసుకున్న వారిని విచారించగా.. చిత్తూరుతోపాటు తమిళనాడు రాష్ట్రంలోనూ చోరీలకు పాల్పడినట్లు ఒప్పుకున్నారు. వారి నుంచి 3.50 లక్షల విలువైన ఏడు వివిధ రకాల ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టుకోవడంలో కృషి చేసిన సిబ్బందిని సీఐలు అభినందించారు.

డైట్‌లో ముగిసిన కళా ఉత్సవం



వెదురుకుప్పం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం జిల్లా విద్యాశిక్షణ సంస్థ(డైట్)లో కళా ఉత్సవం శుక్రవారంతో ముగిసింది. 12 విభాగాల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశామని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ దామోదరరావు తెలిపారు.

బహుమతులు పొందిన విద్యార్థులు

ద్రావిడ వర్సిటీ అభివృద్ధికి సీఎం విశేష కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

గుడుపల్లె, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ద్రావిడ విశ్వవిద్యాలయ అభివృద్ధికి సీఎం చంద్రబాబు నాయుడు విశేష కృషి చేస్తున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం ద్రావిడ వర్సిటీలోని హరప్ప భవనంలోకి మార్చిన ఇంజనీరింగ్ తరగతులను ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ విశ్వవిద్యాలయానికి ఇచ్చిన హామీ మేరకు ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటు చేసి రెండు కోర్సులను(సీఎస్సీ 60సీట్లు , ఏఐ ఎంఎల్ 60సీట్లు) ప్రారంభించడం జరిగిందన్నారు. వర్సిటీ అభివృద్ధికి ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా సహాయ సహకారాలు ఉంటాయని.. బోధన, బోధనేతర సిబ్బంది కలిసి పని చేసి వర్సిటీ అభివృద్ధికి పాటుపడాలన్నారు. ఆర్టీసీ వైస్ ఛైర్మన్ మునిరత్నం మాట్లాడుతూ కుప్పం ప్రాంతాన్ని సీఎం చంద్రబాబు నాయుడు అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంతో విద్యాకేంద్రంగా మారిందన్నారు. ఇంజనీరింగ్ విద్యార్థులు బాగా చదివి విశ్వవిద్యాలయానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. కుప్పం, పలమనేరు, మదనపల్లె అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కమిటీ ఛైర్మన్ డాక్టర్ సురేష్ బాబు మాట్లాడుతూ ద్రావిడ విశ్వవిద్యాలయ అధికారులు ఆశయ సాధనకు, భాష పరిరక్షణ కోసం పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డు మెంబరు వైద్యం శాంతారామ్, ఏపీవీఐడీ ఛైర్మన్ రాజశేఖర్, ఇన్‌చార్జి వీసీ ఆచార్య దొరస్వామి, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ కిరణ్‌కుమార్, డీన్ శ్యామల, రెస్కో ఛైర్మన్ ప్రతాప్, ఏఎంసీ ఛైర్మన్ మునిరాజు, కుప్పం జనసేన సమన్వయ కర్త నరేష్, నాయకులు డాక్టర్ వెంకటేష్, బాబునాయుడు, తులసీనాథ్, అమీర్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చండి

బీసీ సంక్షేమ సంఘం డిమాండ్



డీఆర్వోకు వినతిపత్రాన్ని ఇస్తున్న జ్ఞాన జగదీశ్ తదితరులు

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): 2024 ఎన్నికలకు ముందు చంద్రబాబు నేతృత్వంలోని కూటమి నేతలు బీసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర జేఏసీ ఛైర్మన్ జ్ఞాన జగదీశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఐదు బీసీ డిమాండ్లపై నాయకులు, కార్యకర్తలతో కలిసి ర్యాలీగా కలెక్టరేట్‌కు వెళ్లారు. కలెక్టర్ సుమిత్‌కుమార్, డీఆర్వో మోహన్‌కుమార్‌లకు వినతిపత్రాలను అందించాక మీడియాతో మాట్లాడారు. అన్ని రంగాల్లో వెనుకబడిన బీసీలకు ఎస్సీ, ఎస్టీల మాదిరిగానే ప్రత్యేక చట్టాన్ని తెస్తామని హామీ ఇచ్చారని, ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. అలాగే చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్, నామినేటెడ్ పదవులు, నామినేటెడ్ వర్కుల్లో 34 శాతం అమలు చేస్తామని చెప్పి ఏడాదవుతున్నా పట్టించుకోవడం లేదని గుర్తుచేశారు. మూడు నెలల్లోనే స్థానిక సంస్థల గడువు ముగుస్తున్నా.. ఇంతవరకు సమగ్రంగా కులగణన చేయకుండానే ఎన్నికలను ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. బీసీల జనాభా దామాషా ప్రకారం బీసీ సబ్‌ప్లాన్‌ను రూపొందించి.. ఆ మేరకు బడ్జెట్‌లో నిధులను కేటాయించాలన్నారు. అమరావతిలో జ్యోతిరావు పూలే, సావిత్రీబాయి విగ్రహాలను ఏర్పాటు చేయాలని కోరారు. బీసీ సంక్షేమ సంఘం నేతలు చంద్ర, సెల్వరాజ్, పవన్‌కళ్యాణ్, దిలీప్‌కుమార్, కార్తీక్, మదన్‌కుమార్, రవికుమార్, గోకుల్, లోకేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

టీచర్ అసభ్యకర ప్రవర్తనపై ఫిర్యాదు



విద్యార్థినుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈవో సుబ్రహ్మణ్యం

బైరెడ్డిపల్లె, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవదొడ్డి ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఓ ఉపాధ్యాయుడు కొంతకాలంగా విద్యార్థినులపై అసభ్యకరంగా ప్రవరిస్తున్నాడంటూ విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు శుక్రవారం విద్యాశాఖాధికారులకు ఫిర్యాదుచేశారు. దీంతో ఎంఈవో సుబ్రహ్మణ్యం దేవదొడ్డి పాఠశాలకు వెళ్లి విద్యార్థినులు, తల్లిదండ్రులను విచారించారు. గంగవరం సీఐ పరశురాముడు, బైరెడ్డిపల్లె పోలీసులు పాఠశాలలో జరిగిన పరిణామాల గురించి విచారించి తెలుసుకున్నారు. విద్యార్థినులపై అసభ్యకరంగా ప్రవరిస్తున్న ఉపాధ్యాయుడిపై తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థినుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. పాఠశాలలో విచారణ జరిపిన సమగ్ర నివేదికను డీఈవోకు అందజేయనున్నట్లు ఎంఈవో తెలిపారు. సమాచారం అందుకున్న డీవైఈవో ఇందిర, జీసీడీవో ఇంద్రాణి పాఠశాలకు చేరుకుని విద్యార్థినులు, తల్లిదండ్రులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. తాను విద్యార్థినులపై అసభ్యకరంగా ప్రవర్తించలేదని ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉపాధ్యాయుడు అధికారులకు వివరణ ఇచ్చాడు.

అర్హులైన దివ్యాంగులందరికీ పింఛన్లు అందిస్తాం

ప్రత్యేక 'పీజీఆర్ఎస్'లో కలెక్టర్ హామీ





దివ్యాంగుల సంఘ నేత మురళితో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ - ప్రత్యేక పీజీఆర్ఎస్‌కు హాజరైన దివ్యాంగులు

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): 'దివ్యాంగుల పింఛన్ల తగ్గింపు, తొలగింపుపై ఆందోళనలు వద్దు.. అర్హులందరికీ ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛన్లు అందిస్తాం' అని కలెక్టర్ సుమిత్‌కుమార్ హామీ ఇచ్చారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ భవన్‌లో దివ్యాంగులకు ప్రత్యేక పీజీఆర్ఎస్ (ప్రజా సమస్యల పరిష్కార వేదిక) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు దివ్యాంగులు మాట్లాడుతూ.. అన్ని అర్హతలు ఉన్నప్పటికీ దివ్యాంగులు కాదని అనర్హత వేటు వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. శారీరక వైకల్యం ఉన్నప్పటికీ గంటలకొద్దీ వెరిఫికేషన్ ప్రక్రియను వైద్య బృందం చేపట్టారని, దీనివల్ల అనేక ఇబ్బందులు పడాల్సి వచ్చిందన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. త్వరలోనే న్యూ అసెస్మెంట్ కేంద్రాల ద్వారా ప్రత్యేక వైద్య బృందాలతో సదరన్ క్యాంపులను నిర్వహిస్తామని చెప్పారు. ప్రతి అసెస్మెంట్ కేంద్రంలోనూ డీఆర్‌డీఏ సిబ్బంది, ఫొటో, వీడియోగ్రాఫర్లు ఉండేలా చర్యలు చేపడతామన్నారు. గత నెలలో నాలుగు వేల మందికి నోటీసులు ఇచ్చామని తెలిపారు. అర్హులకూ నోటీసులు ఇచ్చారని దివ్యాంగుల సంఘ నేతలు చెప్పడంతో వారి కోరిక మేరకు మరోసారి అసెస్మెంట్ నిర్వహిస్తామన్నారు. అర్హత పరీక్షల్లో అవకతవకలు జరగకుండా ఉండటం కోసం ధ్రువీకరణ పత్రంలో డాక్టర్, సూపరింటెండెంట్ కూడా సంతకాలు చేస్తారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి, డీఎంహెచ్‌వో సుధారాణి, డీసీహెచ్ఎస్ పద్మాంజలి, దివ్యాంగుల సంఘ నేతలు పాల్గొన్నారు.

నేతిగుట్లపల్లె వద్ద పట్టుబడ్డ ఎర్రచందనం

దుంగలు సహా వాహనాన్ని వదిలి పారిపోయిన స్మగ్లర్లు ● ఒకరిని పట్టుకున్న పోలీసులు



పుంగనూరు పోలీస్‌స్టేషన్‌లో వున్న ఎర్రచందనం తరలించిన కారు

పుంగనూరు, సెప్టెంబరు12 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రానికి ఎర్రచందనం తీసుకెళుతూ మార్గమధ్యంలో మొరాయించిన కారును పోలీసులు శుక్రవారం సీజ్ చేశారు.అన్నమయ్య జిల్లా రాజంపేట, రాయచోటి ప్రాంతం నుంచి గురువారం రాత్రి ముగ్గురు స్మగ్లర్లు ఇన్నోవా కారులో రాయచోటి, మదనపల్లె,పుంగనూరు మీదుగా కర్ణాటకకు 19 ఎర్రచందనం దుంగలను తరలించడానికి బయల్దేరారు. పుంగనూరు మండలం సుగాలిమిట్ట వద్దకు రాగానే కారు మొరాయించగా నేతిగుట్లపల్లె వైపు కారును మళ్లించారు. అక్కడ వల్లం ఉండడంతో హంద్రీనీవా పంప్ హౌస్ వద్దకు వెళ్లి కారు ఆగింది.దీంతో కారులోని ఎర్రచందనం దుంగలను పక్కనే చెట్లు, పొదల మధ్యలో ఉంచి కారు మెకానిక్ కోసం ఉదయం వరకు వెయిట్ చేశారు.వీరిని గమనించిన రైతులు పుంగనూరు సీఐ సుబ్బరాయుడికి సమాచారమిచ్చారు. పోలీసులు హుటాహుటిన ఆ ప్రాంతానికి చేరుకోగా గమనించిన దుండగులు నేతిగుట్లపల్లె రిజర్వాయర్ వైపు పరారయ్యారు. పోలీసులు వెంబడించి వారిలో హోసూరుకు చెందిన సర్దార్‌బాషా(45)ను అదుపులోకి తీసుకుని విచారించడంతో అసలు విషయం బయటపడింది. దీంతో దాచిన ఎర్రచందనం దుంగలను, కారును పోలీసులు సీజ్ చేశారు. పరారైన వారు ఎవరు, ఎక్కడినుంచి ఎర్రచందనం ఎక్కడికి తరలిస్తున్నారు అనే సమాచారం కోసం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

తెలుగు ప్రజలకు అండగా ప్రభుత్వం

● నేపాల్ నుంచి సురక్షితంగా రాష్ట్రానికి చేర్చిన చంద్రబాబు, లోకేశ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల, పీఎస్ఎం తదితరులు

కుప్పం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కేవలం రాష్ట్రంలోనే కాదు, దేశవిదేశాల్లో ఎక్కడున్నా తెలుగు ప్రజలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్.మునిరత్నం, పీకేఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ సురేశ్‌బాబు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నేపాల్‌లో ప్రస్తుతం నెలకొన్న దారుణ పరిస్థితుల్లో చిక్కుకున్న తెలుగు ప్రజలను సురక్షితంగా రాష్ట్రానికి రప్పించడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేశ్ తీసుకున్న చర్యలు సఫలమైన విషయాన్ని గుర్తు చేశారు. దీంతో మంత్రిగా, తెలుగు ప్రజలకు అండగా ఉంటున్న యువ నాయకుడు లోకేశ్ సామర్థ్యం బయటపడిందన్నారు. ఆయనే స్వయంగా ఈ ఆపరేషన్ మొత్తాన్ని నిర్వహించి నేపాల్ సంక్షోభం నుంచి తెలుగు ప్రజలను బయటకు తీసుకొచ్చినందుకు రాష్ట్ర ప్రజలు రుణపడి ఉంటారన్నారు. ప్రతిపక్ష నేత జగన్‌రెడ్డి పిచ్చిపట్టినట్లు అసంబద్ధ విమర్శలు చేయడంపై నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మెడికల్ కాలేజీల విషయంలో ఆయన చేస్తున్న విమర్శలు పూర్తిగా నిరాధారమైన అబద్ధపు ఆరోపణలని కొట్టిపడేశారు. పునాదులకే పరిమితమైన మెడికల్ కళాశాలలను పూర్తి చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకుంటున్న నిర్ణయాలు ప్రశంసనీయమని తెలిపారు. ఇకనైనా జగన్‌రెడ్డి, ఆయన పార్టీ నాయకులు అసంబద్ధ విమర్శలు మానుకోకపోతే ప్రజలే వారికి గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. సమగ్ర సర్వే తర్వాత కుప్పం నియోజకవర్గంలో మొత్తం 7500 బంగారు కుటుంబాలు తేలాయన్నారు. వీటిలో కనీసం 50 శాతం కుటుంబాలను అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు దత్తత తీసుకుంటారని హామీ ఇచ్చారు. సమావేశంలో కుప్పం రెస్కో ఛైర్మన్ వీజీ.ప్రతాప్, టీటీడీ బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, కౌన్సిలర్ జిమ్ దాము, మాజీ సర్పంచి రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

తండ్రికి తగ్గ తనయుడు లోకేశ్

ఎమ్మెల్యే భానుప్రకాష్

నింద్ర, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న వారికి ఆపన్నహస్తాన్ని అందించడంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు సాటెవ్వరూ లేరని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ కొనియాడారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నేపాల్లో చిక్కుకున్న తెలుగువారిని రాష్ట్రానికి సురక్షితంగా రప్పించడం కోసం లోకేశ్ తీసుకున్న చొరవ అభినందనీయమన్నారు. తండ్రికి తగ్గ తనయుడిగా బాధ్యతతో వ్యవహరించడం వల్లే తెలుగువారు క్షేమంగా మనదేశానికి చేరుకోగలిగారని చెప్పారు. మరోవైపు రాష్ట్రానికి తెలుగువారిని తీసుకురావడానికి సీఎం చంద్రబాబు ఆదేశాలతో లోకేశ్ చేపట్టిన ఆపరేషన్ సక్సెస్ అయిందని హర్షం వ్యక్తం చేశారు. తెలుగు ప్రజల సంరక్షణ కోసం కూటమి ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు ఎప్పుడూ స్ఫూర్తిగా నిలుస్తాయని తెలిపారు.

దేశ ఐక్యతకు మూలం హిందీ భాష





హిందీ ప్రాధాన్యాన్ని తెలిపేలా ఏర్పాటు చేసిన చిత్రపటం వద్ద టీచర్లు, విద్యార్థులు - హిందీ అక్షరమాలతో విద్యార్థిని

వెదురుకుప్పం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రజల ఐక్యతకు మూలాధారం హిందీ భాష అని కార్వేటినగరం మండలం డీఎంపురం జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం నాదమునిరెడ్డి తెలిపారు. ముందస్తు హిందీ భాషా దినోత్సవాన్ని శుక్రవారం పాఠశాలలో నిర్వహించారు. హిందీ టీచర్ మాలతి.. విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజల నమ్మకాన్ని నాయకులు నిలబెట్టుకోవాలి



సమావేశంలో పాల్గొన్న టీడీపీ మండలాధ్యక్షుడు ప్రేమ్‌కుమార్

కుప్పం రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నాయకులనేవారు నిరంతరం ప్రజల్లో ఉంటూ నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని కుప్పం మండల టీడీపీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ అన్నారు. మండలంలోని దాసేగానూరు, చందం పంచాయతీలలో శుక్రవారం టీడీపీ పంచాయతీ సమన్వయ కమిటీ సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ నమ్మి అధికారాన్ని ఇచ్చిన ప్రజలకు నిరంతరం నాయకులు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో స్థానిక యూనిట్, క్లస్టర్ ఇన్‌చార్జిలు, పంచాయతీ పార్టీ అధ్యక్షులు, సమన్వయ కమిటీ సభ్యులు, వెంకటాచలం గౌడు, రామకృష్ణ, హైదర్ వలి, అశోక్, శేషగిరి, రాధాకృష్ణమూర్తి, మేఘనాథం, దామోదర్, మణి, గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న అమృతవల్లీ

రామకుప్పం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో రైతులకు అదనపు ఆదాయం వస్తుందని ప్రకృతి వ్యవసాయం కుప్పం ప్రాజెక్టు డీపీఎం అమృతవల్లీ తెలిపారు. శుక్రవారం రామకుప్పంలో ప్రకృతి వ్యవసాయంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో రైతులకు నాణ్యమైన, అధిక దిగుబడితో అదనపు ఆదాయం సమకూరుతుందన్నారు. అలాగే ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు తినడం తో ప్రజలు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. జీవామృతాన్ని వరి, వేరుశనగతో పాటు ఇతర ఉద్యానపంటలపై పిచికారి చేస్తే మొక్కల ఆకులు, కాండం ఆరోగ్యవంతంగా పెరుగుతాయన్నారు. అలాగే పూత దశలో పిచికారి చేస్తే అధిక పంట దిగుబడి, నాణ్యత, రుచి ఉంటుందన్నారు. తెలుగు రైతు నియోజకవర్గ, మండల అధ్యక్షులు చలపతి, బాబు, టీడీపీ మండలాధ్యక్ష, మాజీ అధ్యక్షులు ఆనందరెడ్డి, అంజనేయరెడ్డి, ప్రధాన కార్యదర్శి నరసింహులు, మాజీ ఎంపీపీ చిన్నకృష్ణ, రెస్కో వైస్‌చైర్మన్ విశ్వనాథ్, ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు కృష్ణానాయక్, ఎంపీటీసీ అరుణజ్ఞానశేఖర్, క్లస్టర్ ఇన్‌చార్జి రవిరెడ్డి, కో-ఇన్‌చార్జి నవీన్, యూనిట్ ఇన్‌చార్జి వెంకటరమణ, సింగిల్‌విండో డైరెక్టరు సురేష్ పాల్గొన్నారు.

రైతులకు ఉద్యాన మొక్కల పంపిణీ



ఉద్యాన మొక్కల పెంపకంపై అవగాహన కల్పిస్తున్న సంస్థ ప్రతినిధులు

రామకుప్పం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం ముళబాగల్‌కు చెందిన ప్రకృతి సేవా సంస్థ బెంగళూరు ఇన్ఫోసిస్ కంపెనీ సహకారంతో శుక్రవారం రామకుప్పం మండలం కెంప సముద్రం, కోట్లగూరు గ్రామాల్లో రైతులకు ఉచితంగా ఉద్యాన మొక్కలను పంపిణీ చేశారు. అనంతరం కెంపసముద్రంలో జరిగిన సదస్సులో ఉద్యాన మొక్కల పెంపకంపై సంస్థ ప్రతినిధులు రైతులకు అవగాహన కల్పించారు.

ఇంటి నుంచే ఉపాధి అవకాశాలు



నిరుద్యోగ యువతతో మాట్లాడుతున్న ఎంపీడీవో ఏపీఆర్ కుమార్

శాంతిపురం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచే ఉపాధి పొందేందుకు సచివాలయాల్లో దరుఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీవో ఏపీఆర్ కుమార్ తెలిపారు. శుక్రవారం మఠం సచివాలయంలో వర్క్ ఫ్రం హోం (కౌసల్యం)తో నిరుద్యోగ యువతీ యువకులతో ఎంపీడీవో సమావేశమయ్యారు. ఇంటి వద్దనే విద్యార్హత కలిగిన పనిని ఎంపిక చేసుకొని ఉపాధి పొందొచ్చన్నారు. పదో తరగతి ఆపై విద్యార్హత కలిగినవారు మండలంలో ఇప్పటి వరకు 4,350 మంది వర్క్ ఫ్రం హోం (కౌసల్యం)కు సచివాలయాల్లో నమోదు చేసుకున్నారన్నారు. వీరిలో 2,759 మంది వారి ధ్రువపత్రాలను సమర్పించారని తెలిపారు. మిగిలిన 1,591 మంది వారికి సంబంధించిన ధ్రువపత్రాలను సచివాలయాల్లో వెంటనే సచివాలయ సిబ్బందికి అందించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మురళీ, పంచాయతీ కార్యదర్శి గౌస్‌బాషా, నేతలు జయపాల్, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

వైష్ణవిదేవికి ప్రత్యేక పూజలు



చౌడేపల్లె, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పుదిపట్లలో వెలసిన వైష్ణవిదేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు వినోద్‌కుమార్‌రెడ్డి, శ్రావణి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

16, 17 తేదీల్లో విద్యార్థులకు క్రీడా పోటీలు

కుప్పం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 16, 17 తేదీల్లో అండర్-14, అండర్-17 బాలబాలికల మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు కుప్పం ఎంఈవో-1 ఎం.కుమారి, ఎంఈవో-2 రాజారాం, మండల నోడల్ హెడ్ మాస్టర్ ఎస్.వెంకటేష్ బాబు తెలిపారు. ద్రావిడ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో అథ్లెటిక్స్, ఖో ఖో, కబడ్డీ, వాలీబాల్, యోగా, చెస్, బ్యాడ్మింటన్ అంశాల్లో పోటీలు ఉంటాయన్నారు. మండలంలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ఏపీ మోడల్, గురుకుల, కేజీబీవీ, ప్రైవేటు తదితర పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. క్రీడా పోటీలలో పాల్గొనదలిచే విద్యార్థులు క్రీడా పరికరాలు, ఆట వస్తువులు సొంతంగా తీసుకురావాలన్నారు. అండర్-14 పోటీలకు 2012 జనవరి 1 తర్వాత జన్మించి, ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. అలాగే అండర్-17 పోటీలలో పాల్గొనే విద్యార్థులు 2009లో జన్మించి ఉండాలని సూచించారు.

16న ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం

శాంతిపురం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): శాంతిపురం మండల సచివాలయంలోని సమావేశ భవనంలో ఈనెల 16న ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు శివయ్య తెలిపారు. సమావేశానికి మండలంలోని ఎస్సీ, ఎస్టీ నేతలు, అధికారులు, దళిత ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని కోరారు.

రాజుకాలువ ఆక్రమణలను తొలగించాలి



రాజుకాలువను పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీనివాసులురాజు

శాంతిపురం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : శాంతిపురంలోని రాజుకాలువ ఆక్రమణలను వెంటనే తొలగించాలని తహసీల్దారు శివయ్య, రెవెన్యూ సిబ్బందికి కుప్పం ఆర్డీవో శ్రీనివాసులురాజు ఆదేశాలు జారీచేశారు. శుక్రవారం ఆర్డీవో తన సిబ్బందితో కలిసి మండల కేంద్రంలోని ప్రధాన రాజుకాలువను ఆయన పరిశీలించారు. గడ్డూరు చెరువు నుంచి శాంతిపురం పాలారు నది వరకు కాలువ ఉంది. ఈ కాలువ ఆక్రమణపై అందిన ఫిర్యాదు మేరకు స్పందించిన ఆయన పరిశీలించారు. ఆయన వెంట అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

క్రీడా దుస్తుల వితరణ



క్రీడాకారులతో సునీల్ రాజ్ తదితరులు

కుప్పం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా జూనియర్స్ షూటింగ్ బాల్ బాలురు, బాలికల జట్లకు రూ.20 వేలు విలువ కలిగిన క్రీడా దుస్తులను బీసీఎన్ చారిటబుల్ ట్రస్టు, కుప్పం లయన్స్ క్లబ్ శుక్రవారం వితరణ చేశారు. ఇటీవలే ఎంపికైన ఈ జట్లు నెల్లూరులో జరగబోయే రాష్ట్ర స్థాయి ఛాంపియన్‌షిప్ పోటీలలో పాల్గొననున్నాయి. ఈ సందర్భంగా కుప్పం ఇంజనీరింగ్ కళాశాల వైస్ చైర్మన్ డాక్టర్ సునీల్ రాజ్ మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడమే తమ వితరణలోని ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ చైర్మన్ మహేశ్, కేఈసీ ప్రిన్సిపాల్ సుధాకర్ బాబు, హెచ్‌వోడీ కోదండరాం, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ మాధవన్, పీఆర్వో ప్రవీణ్, గంగాధర్, పీఈటీలు వేణు, జబీర్, స్వాతి, సంధ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బోయకొండ గంగమ్మకు రాహుకాలాభిషేకాలు



చౌడేపల్లె, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా రాహుకాలాభిషేకాలు నిర్వహించారు. అమ్మవారికి ప్రీతికరమైన రాహుకాలంలో పసుపు, కుంకుమ, గంధం, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకొన్నారు. ఈవో ఏకాంబరం భక్తులకు అన్నదానం ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని కలిసిన డీఎల్‌డీవో

పలమనేరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని శుక్రవారం డీఎల్‌డీవో కె.రామచంద్ర మర్యాద పూర్వకంగా కలిశారు. తిరుపతి ఎంపీడీవోగా పనిచేస్తున్న కె.రామచంద్ర పదోన్నతిపై జిల్లాకు బదిలీపై వచ్చారు. దీంతో మొదటిసారి నియోజకవర్గ అభివృద్ధి పనుల సమీక్ష సమావేశం కోసం విచ్చేసిన ఆయన స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా పలమనేరులో డీఎల్‌డీవో కార్యాలయం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, త్వరగా పనులు జరగాలని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ఆదేశించడం తోపాటు పలు అంశాలపై వారు చర్చించారు. కార్యక్రమంలో పెద్ద పంజాణి ఎంపీడీవో బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక మార్గాన్ని ఎంచుకోవాలి



మాట్లాడుతున్న స్వయం ప్రకాశ సచ్చిదానంద సరస్వతిస్వామి

పుంగనూరు, సెప్టెంబరు 12 (ఆంధ్ర జ్యోతి): సమాజంలో హిందుత్వాన్ని బలపరిచేందుకు ఆధ్యాత్మికత మార్గం వైపు ప్రతిఒక్కరూ ముందుకు నడవాలని హరిహరపురం మఠాధిపతి ప్రకాశ సచ్చిదానంద సరస్వతిస్వామి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక కోనేరు వద్ద గల శంకరమఠంలో శ్రీరామానందస్వామి ఆరాధన ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ఆశీస్సులు పొందడానికి అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో కోనేటి ప్రాంతం ఆధ్యాత్మిక వాతావరణంతో మార్మోగింది. ఈ సందర్భంగా స్వామి మీడియాతో మాట్లాడుతూ ప్రజలు శాంతియుతంగా జీవించడానికి భక్తిభావం పెంచుకోవాలని, కోపతాపాలకు తావు ఇవ్వరాదన్నారు. ప్రస్తుతం సమాజంలో శాంతి నశిస్తోందని, విద్వేషాలకు దూరంగా ఉంటూ శాంతి, ధర్మం, భగవంతుడిపై విశ్వాసం పెంచుకుని మెలగాలని చెప్పారు. విశ్రాంత డీఎస్పీ కె.సుకుమార్‌బాబు, పలువురు పట్టణ ప్రముఖులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కుప్పంలో శరవేగంగా అభివృద్ధి, సంక్షేమం

మండల సమావేశంలో అధికారులు



ఉపాధి పనుల వివరాలను తెలియజేస్తున్న ఏపీవో హరి

కుప్పం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు శరవేగంగా సమర్థంగా అమలు చేస్తున్నామని పలు ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు తెలిపారు. స్థానిక మండల సచివాలయంలోని సమావేశ భవనంలో శుక్రవారం కుప్పం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ అశ్విని, జడ్పీటీసీ శరవణ మండలంలో అమలవుతున్న పథకాలు, ప్రజలకు అందిస్తున్న సదుపాయాల గురించి అధికారులను ప్రశ్నించారు. దీనికి పలువురు అధికారులు సమాధానమిస్తూ ప్రభుత్వం తరపున తాము తమ విధులను సక్రమంగా నిర్వహిస్తున్నామన్నారు. తమతమ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను గణాంకాలతో సహా వివరించారు. మండల వ్యవసాయాధికారి ఫయాజ్ మాట్లాడుతూ యూరియా సరిపడినంత అందుబాటులో ఉందని చెప్పారు. రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రైతు సేవా కేంద్రాల్లో తమ భూమి పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు అందించి పేర్లు నమోదు చేసిన అర్హులైన రైతులందరికీ నిర్దేశిత పరిమాణంలో యూరియా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. జాతీయ గ్రామీణ ఉపాధి పథకం ఏపీవో హరి, ఆరోగ్య, నీటిపారుదల, పంచాయతీ రాజ్, గ్రామణ తాగునీటి సరఫరా తదితర అధికారులు సైతం తమ శాఖల్లో అమలవుతున్న అభివృద్ధి పథకాలను సభకు వివరించారు. సమావేశంలో ఎంపీడీవో ఎం.వెంకటేశ్వర్లు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల కష్టాలు





రామకుప్పం మనగ్రోమోర్ కేంద్రం వద్ద రైతులు, చౌడేపల్లెలో యూరియా కోసం ఎగబడుతున్న రైతులు

రామకుప్పం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలంలో రైతులు యూరియా కొరతతో సతమతమవుతున్నారు. గత కొంత కాలంగా వర్షాలు కురవడం, భవిష్యత్‌లో విస్తారంగా వానలు కురుస్తాయన్న ఆశతో ఎన్నడూ లేని విధంగా రైతులు ఇతర పంటలతోపాటు అధిక విస్తీర్ణంలో వరి, రాగి సాగు చేపట్టారు. పంటల ఎదుగుదలకు ప్రస్తుతం యూరియా అవసరం కాగా.. ఇటీవల మండలానికి వచ్చిన 63 టన్నుల యూరియాను రైతు సేవా కేంద్రాల్లో రైతులకు పంపిణీ చేశారు. రామకుప్పం మండలంలోని మనగ్రోమోర్ కేంద్రంలో శుక్రవారం 100 బస్తాల యూరియాను రైతులకు అందించారు. యూరియా కోసం రైతులు అక్కడ బారులు తీరారు. ఈ విషయమై మండల వ్యవసాయాధికారి అమృత మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు 63 టన్నుల యూరియాను రైతు సేవా కేంద్రాల ద్వారా, 100 బస్తాలను మనగ్రోమోర్ కేంద్రం ద్వారా రైతులకు పంపిణీ చేశామన్నారు. మండలానికి మరో 63 టన్నుల యూరియా వస్తే కొరత తీరినట్టేనని ఆమె తెలిపారు. త్వరలోనే రైతు సేవా కేంద్రాలతోపాటు సింగిల్‌విండో కార్యాలయం, మండలంలోని అన్ని ఎరువుల దుకాణాల్లో అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు.

● **చౌడేపల్లె:** యూరియా కోసం రైతులకు తిప్పలు తప్పడం లేదు. శుక్రవారం మండలంలోని పుడమి, గ్రోమోర్, సత్యనారాయణ పర్టిలైజర్స్‌లకు యూరియా స్టాక్ వచ్చింది. అయితే ఉదయం నుంచే రైతులు పుడమి, గ్రోమోర్‌ల వద్ద బారులు తీరారు. పోలీసులు ఘర్షణలు జరగకుండా బందోబస్తు నిర్వహించగా.. అగ్రికల్చర్ అధికారులు టోకన్లు పంపిణీ చేశారు. పుడమి 200 బస్తాలు, గ్రోమోర్ 300 బస్తాలు, సత్యనారాయణ పర్టిలైజర్స్ 600 బస్తాలు యూరియా స్టాక్ వచ్చింది. వచ్చిన స్టాక్ రెండు, మూడు గంటల్లోనే ఖాళీ కావడంతో పలువురు రైతులు యూరియా లేకుండానే వెనుతిరిగారు. సోమవారం అన్ని రైతు సేవా కేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉంటుందని.. రైతులు కంగారు పడకండని ఏవో మోహన్‌కుమార్ తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంకండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్డీపీఐ నాయకులు

పుంగనూరు రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి సిద్ధంగా ఉండాలని పుంగనూరు నియోజకవర్గ ఎస్డీపీఐ అధ్యక్షుడు సిద్దిక్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా నాయకులు, కార్యకర్తల సమావేశంలో అయన మాట్లాడారు. పట్టణ, మండల పరిధిలో జరిగే ఎన్నికల్లో పోటీ చేసి గెలవడానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో నాయకులు ఆసిఫ్, షామీర్, చాంద్‌బాషా, ఖాదర్‌బాషా, సర్దార్, రషీద్, అతిక్‌బాషా, సద్దాం, తౌసిప్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులు దారుణం



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

పుంగనూరు రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రైతుల కోసం ఆందోళనలు చేసిన మదనపల్లె సీపీఐ నాయకులపై పోలీసులు అక్రమ కేసులు పెట్టడం దారుణమని పుంగనూరు సీపీఐ నాయకులు ఆరోపించారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో వారు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు యూరియా కోసం ఇబ్బందులు పడుతుంటే వారికి మద్దతుగా మదనపల్లె సీపీఐ నాయకులు నిరసన కార్యక్రమాలు చేస్తే వారిపై కేసులు నమోదు చేయడం సరికాదన్నారు. ప్రజాస్వామ్య దేశంలో హక్కుల కోసం పోరాటాలు చేయడం సర్వసాధారణమన్నారు. అయితే పోలీసులు అత్యుత్సాహం చూపి ఆందోళనకారులపై కేసులు పెట్టడం మానుకోవాలని.. లేని పక్షంలో ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు చేపట్టడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు వెంకటరమణారెడ్డి, రామ్మూర్తి పాల్గొన్నారు.

ఆత్మరక్షణపై అవగాహన ఉండాలి



మత్తు పదార్థాల అనర్థాలపై ర్యాలీలో పాల్గొన్న ఉపాధ్యాయులు

సదుం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): యుక్త వయస్సులోని బాలికలు ఆత్మరక్షణపై అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ పులిచెర్ల ప్రాజెక్టు సీడీపీవో వాణిశ్రీదేవి సూచించారు. సంకల్ప కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని పాలమంద జడ్పీ ఉన్నత పాఠశాలలో కిశోర బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రత, గుడ్ టచ్-బ్యాడ్ టచ్, బాల్య వివాహాలపై అనర్థాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మల్లీశ్వరి, పాఠశాల సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం బోల్తా : ఒకరికి గాయాలు

చౌడేపల్లె, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తా పడటంతో ఐరాల మండలానికి చెందిన కుమార్ (55) గాయపడ్డాడు. శుక్రవారం బోయకొండ గంగమ్మ దర్శనం కోసం వచ్చి వెళ్తుండగా కొలింపల్లె క్రాస్ వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో గాయపడిన అతడిని స్థానికులు పీహెచ్‌సీకి తరలించి చికిత్సలు అందించారు.

జూనియర్ కళాశాల అభివృద్ధికి రూ.5 లక్షల మంజూరు

చౌడేపల్లె, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జూనియర్ కళాశాల అభివృద్ధి పనుల కోసం రూ.5 లక్షల నిధులు మంజూరైనట్లు టీడీపీ మండలాధ్యక్షుడు రమేష్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక జూనియర్ కళాశాలలో ప్రహరీ, వంటగది నిర్మాణం, గేటు ఏర్పాటుకు రూ.5 లక్షల నిధులు మంజూరైనట్లు పేర్కొన్నారు.

యుగంధర్‌రెడ్డికి ఉత్తమ రైతు అవార్డు



ఉత్తమ రైతు అవార్డు అందుకుంటున్న యుగంధర్ రెడ్డి

గుడుపల్లె, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.గొల్లపల్లె గ్రామానికి చెందిన యుగంధర్ రెడ్డి ఉత్తమ రైతు అవార్డు అందుకున్నారు. ఈనెల 11వ తేదీన శ్రీ సత్యసాయి జిల్లా మడకశిరలో కేంద్ర పట్టు మండలి, జౌళి శాఖ, రాష్ట్ర పట్టు పరిశ్రమశాఖ ఆధ్వర్యంలో 'నా పట్టు.. నా అభిమానం' కార్యక్రమం జరిగింది. సమావేశంలో పట్టు పురుగుల పెంపకంలో ఉత్తమ పద్ధతులను అనుసరించి అధిక దిగుబడి సాధించినందుకు రైతులను సత్కరించారు. ఈ సందర్భంగా యుగంధర్‌రెడ్డిని పట్టు పరిశ్రమశాఖ అధికారులు అభినందించి జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందించి సన్మానించారు. ఆయన్ను కూటమి నాయకులు, రైతులు అభినందించి సన్మానించారు.

సింగిల్‌విండోల్లో యూరియా పంపిణీకి వినతి



మురళీకృష్ణకు వినతి పత్రం అందిస్తున్న సింగిల్‌విండో చైర్మన్లు

రామకుప్పం, సెప్టెంబరు 12 (ఆంధ్ర జ్యోతి): యూరియా కొరతను దృష్టిలో ఉంచుకొని సింగిల్‌విండోల ద్వారా రైతులకు యూరియా పంపిణీ చేయాలని కుప్పం నియోజకవర్గానికి చెందిన సింగిల్‌విండో చైర్మన్లు మహ్మద్‌రఫీ, గోపాల్, రమేష్ శుక్రవారం చిత్తూరులో వ్యవసాయశాఖ జేడీ మురళీకృష్ణను కలిసి వినతిపత్రం అందించారు. నియోజకవర్గంలో ఇటీవల పంపిణీ చేసిన యూరియా చాలకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. త్వరలోనే సింగిల్‌విండోలకు యూరియాను కేటాయిస్తామని జేడీ చెప్పారని చైర్మన్లు తెలిపారు.

కౌండిన్య రిజర్వాయర్‌లో మృతుడు దేవేంద్ర



దేవేంద్ర (ఫైల్ ఫొటో)

పలమనేరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు సమీపంలోని కాలువపల్లి వద్ద కౌండిన్య రిజర్వాయర్‌లో గురువారం రాత్రి శవమై తేలిన మృతుడు స్థానిక ఎస్టీ కాలనీకి చెందిన దేవేంద్రగా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడు పక్షవాతంతో బాధపడుతుండేవాడని.. రిజర్వాయర్ వద్ద ప్రమాదవశాత్తు పడి మృతిచెంది ఉండొచ్చని కుటుంబ సభ్యులు తెలిపినట్లు పేర్కొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై ప్రధాని మోదీకి పాలాభిషేకం



ప్రధాని చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

వి.కోట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): దేశంలో జీఎస్టీని తగ్గించి సామాన్య ప్రజలకు ఊరట కలిగించిన ఘనత ప్రధాని మోదీకే దక్కిందని బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి శివరాయల్ అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం పట్టణంలోని ఎగువ చెక్‌పోస్టు కూడలిలో మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షులు రామచంద్రుడు, జిల్లా మాజీ కార్యదర్శి రాజసింహులు, నేతలు గోపీనాథ్, కృష్ణా, రవికుమార్, పార్థసారథి, సతీష్, సునీల్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి మహిళా ఒక శక్తిగా ఎదగాలి: ప్రభుత్వ విప్ థామస్



లబ్ధిదారులకు మెగా చెక్కును అందిస్తున్న థామస్

వెదురుకుప్పం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళా ఒక శక్తిగా ఎదగాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ విప్ థామస్ అన్నారు. శుక్రవారం వెదురుకుప్పం మండలం వెలుగు కార్యాలయ ఆవరణంలో నియోజకవర్గంలోని డ్వాక్రా సంఘాలకు వడ్డీలేని రుణాలను అందజేయడానికి సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా వచ్చిన థామస్ మాట్లాడుతూ.. మహిళ ఆర్థికంగా ఎదిగినప్పుడే కుటుంబాలు నిలదొక్కుకుంటాయని సీఎం చంద్రబాబు భావించే డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేశారన్నారు. అనంతరం ఆరు మండలాల మహిళా సంఘాలకు రూ.61.95 కోట్ల మెగా చెక్కును అందజేశారు. తహసీల్దార్ బాబు, ఏపీఎం పరశురామిరెడ్డి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి యుగంధర్, టీడీపీ నాయకులు పి.మోహన్‌మురళి, సాతాల గుణశేఖర్, పైడి మనోహర్‌నాయుడు, చిరంజీవులునాయుడు, బోడిరెడ్డి సుధాకర‌రెడ్డి, చంద్రబాబురెడ్డి, దేవరాజులునాయుడు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ


బాధితుడికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

నింద్ర, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్న పేదలను ఆదుకోవడానికి ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అన్నారు. శుక్రవారం నగరిలో ఏడుగురికి మంజూరైన రూ.5,22,533 చెక్కులను అందజేశారు. నగరి టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుణశేఖర్, పీఏసీఎస్ చైర్మన్ బాలాజి, రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు జవహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల సమస్యలు పరిష్కరించండి: ఏపీటీఎఫ్



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న టీచర్లు

బంగారుపాళ్యం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): టీచర్ల సమస్యలను పరిష్కరించాలంటూ ఏపీటీఎఫ్ బంగారుపాళ్యం శాఖ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా నాలుగు డీఏలు, పీఆర్సీ బకాయిలు ఇంతవరకు చెల్లించలేదని చెప్పారు. 12 పీఆర్సీని ఏర్పాటు చేసి, సీపీఎస్‌ను రద్దు చేయలేదన్నారు. అనంతరం డీటీ కల్యాణికి వినతి పత్రం అందజేశారు. ఏపీటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు గోపీనాథ్, మండల అధ్యక్షుడు నవీన్, సభ్యులు మురళీకృష్ణ, వాసుదేవయ్య, చిరంజీవి, శ్రీనివాసులు, రామకృష్ణ, సునీత, మొగిలయ్య, ఇబ్రహీం, ఉషా, నాసిర్ బాషా, ధనలక్ష్మి, వంశీకృష్ణ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై ఎందుకీ నిర్లక్ష్యం

పనితీరు మార్చుకోండి ● వీవోలపై డీఆర్‌డీఏ పీడీ ఫైర్


సమావేశంలో ప్రసంగిస్తున్న శ్రీదేవి

గుడిపాల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో ఎందుకింత నిర్లక్ష్యం వహిస్తున్నారని వీవోలపై డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం డీఆర్‌డీఏ మీటింగ్ హాలులో గుడిపాల, చిత్తూరు మండలాలకు సంబంధించి ఏపీఎంలు, వీవోలతో సమావేశాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. రెండు మండలాల్లో ఆశినంత స్థాయిలో ప్రోగ్రెస్ లేదన్నారు. పనితీరు మార్చుకోకుంటే చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. డీపీఎం మధుసూదన్, ఏపీఎం సుధారాణి, సీసీలు పాల్గొన్నారు.

లోకేష్ కృషితో స్వస్థలాలకు తెలుగు ప్రజలు: టీడీపీ


సురేంద్ర కుమార్

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేష్ కృషితో నేపాల్ నుంచి తెలుగు ప్రజలు స్వస్థలాలకు చేరుకున్నారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్ తెలిపారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. నేపాల్‌లో జరుగుతున్న మారణ హోమంలో తెలుగువారు ఉన్నారని తెలుసుకున్న వెంటనే ఆలస్యం చేయకుండా నారా లోకేష్ స్పందించారని చెప్పారు. అక్కడ చిక్కుకున్న సుమారు 215 మంది తెలుగు ప్రజలను సురక్షితంగా రాష్ట్రానికి తీసుకురావడానికి లోకేష్ ఎంతగానో కృషి చేశారని కొనియాడారు.

విద్యార్థులకు అభినందన



చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం డైట్‌లో శుక్రవారం జరిగిన కళా ఉత్సవంలో చిత్తూరు ప్రభుత్వ ట్రైనింగ్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు పాఠశాల స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉపాధ్యాయులు తెలిపారు. పదో తరగతి చదువుతున్న ఎస్.మితేష్.. డ్రాయింగ్‌లో, 9వ తరగతి విద్యార్థి సి.మల్లేష్ కుమార్.. జంబూ వాయిద్యంలో జిల్లా స్థాయిలో ప్రతిభచూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని హెచ్‌ఎం, అధ్యాపకులు అభినందించారు.

చదువుకున్న పాఠశాలను కాపాడుకోవాలి


విద్యార్థినులతో పూర్వ విద్యార్థులు

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): చదువుకున్న పాఠశాలను కాపాడుకోవాల్సిన బాధ్యత తమపై ఉందని పలువురు పూర్వ విద్యార్థులు అభిప్రాయపడ్డారు. 98వ కణ్ణన్ జయంతిని పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. అవార్డులు పొందిన ప్రముఖులను సన్మానించారు. 75 మంది విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేశారు. సంఘం నాయకులు సుబ్రమణ్యం, మురళి, మదన్‌మోహన్, సుశీలమ్మ, శ్రీధర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ సయ్యద్ మౌల, ఇన్‌చార్జి హెచ్‌ఎం ఖాదర్‌వలి, దామోదర్‌నాయుడు, పార్థసారథి నాయుడు, అరుణ్‌శివప్రసాద్, ఉమాదేవి, లలిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన

బంగారుపాళ్యం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో విద్యార్థులకు శుక్రవారం ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. టీచర్లు మురళి, మురళీకృష్ణ, ఎయిడ్స్ ప్రాజెక్టు డైరెక్టర్ సద్దాం,ద్రాక్షాయిణి పాల్గొన్నారు.

నేడు హైకోర్టు జడ్జి రాక

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక హైకోర్టు జడ్జి జస్టిస్ జి.బసవరాజ శని, ఆదివారాల్లో ఉమ్మడి జిల్లా పర్యటనకు వస్తున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 7.30 గంటలకు బెంగళూరు నుంచి కారులో బయల్దేరి ముళ్‌బాగల్ మీదుగా మధ్యాహ్నం 12 గంటలకు కాణిపాకం చేరుకుంటారు. స్వయంభు వరసిద్ధి వినాయకస్వామిని దర్శించుకున్నాక ఒంటి గంటకు కాణిపాకం నుంచి బయల్దేరి శ్రీకాళహస్తికి వెళ్తారన్నారు. ఆదివారం తిరుపతి జిల్లాలో పర్యటిస్తారని కలెక్టర్ ఆ ప్రకటనలో వివరించారు.

ఐరాల ఎంపీడీవోగా చంద్రశేఖర్‌రెడ్డి

ఐరాల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఐరాల నూతన ఎంపీడీవోగా చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన రామచంద్రాపురంలో ఏవోగా పని చేస్తూ పదోన్నతి బదిలీపై ఇక్కడికొచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేస్తుండిన ధనలక్ష్మి పదోన్నతిపై చిత్తూరుకు బదిలీ అయ్యారు.





వరసిద్ధుడి ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా ఆలయ ఆస్థాన మండపంలో నాగిని నృత్యం - పెనుగొండకు చెందిన 'ప్రగలి గ్లోబెల్‌జెన్' విద్యార్థుల నృత్యం

వరసిద్ధుడి ఆలయానికి కానుకగా బ్యాటరీ వాహనం

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధుడి ఆలయానికి తవణంపల్లె మండలం కె.పట్నంలోని కెనరా బ్యాంకు వారి సౌజన్యంతో బ్యాటరీ వాహనాన్ని శుక్రవారం కానుకగా అందించారు. దివ్యాంగులు, వృద్ధుల కోసం ఈ వాహనాన్ని వినియోగిస్తామని డీఈవో సాగర్‌బాబు తెలిపారు. ఏఈవోలు రవీంద్రబాబు, ప్రసాద్, సీఏవో నాగేశ్వరచౌదరి, చీఫ్ జనరల్ మేనేజర్ అనూరాధ, జనరల్ మేనేజర్ పాండురంగ, డిప్యూటీ జనరల్ మేనేజర్ రామ్మోహన్, పట్నం కెనరా బ్యాంకు మేనేజర్ జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.





గ్లాసు, ఇసుప చువ్వలపై నృత్యం చేస్తున్న కళాకారులు

దుర్గాంబ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలకు శ్రీకారం


ఆలయం వద్ద ఏర్పాటు చేసిన రాటు


ఆర్వో వాటర్ ప్లాంటును ప్రారంభిస్తున్న తిమ్మారెడ్డి, ద్వారకనాథరెడ్డి, దిలీప్ రెడ్డి

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గిరింపేట దుర్గాంబ ఆలయంలో ఈనెల 22వ తేదీ నుంచి జరగనున్న అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలకు శుక్రవారం శ్రీకారం చుట్టారు. ఈ మేరకు ఆలయం వద్ద ఈవో తిమ్మారెడ్డి, పాలక మండలి చైర్మన్ దిలీప్‌రెడ్డిలు రాటు (స్తంభం)ను శాస్త్రోక్తంగా ఏర్పాటు చేశారు. రియల్ ఎస్టేట్ యజమాని ద్వారకనాథ రెడ్డి ఉభయంతో ఆలయ వాణిజ్య సముదాయంలో ఆర్వో వాటర్ ప్లాంటును ప్రారంభించారు. అర్చకులు అమ్ము, జగదీశ్‌లు, సుబ్బు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా భాద్రపద మాసం మూడో శుక్రవారం సందర్భంగా దుర్గాంబ ఆలయానికి భక్తులు పోటెత్తారు. నెయ్యి, నూనె దీపాలు వెలిగించి అమ్మవారిని పూజించారు.


దీపారాధన చేస్తున్న భక్తులు

'తెలుగు అమ్మయితే.. హిందీ నాన్న'



సమావేశంలో ప్రసంగిస్తున్న హెచ్‌ఎం రమేష్

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తెలుగు అమ్మ భాష అయితే.. హిందీ నాన్న భాష వంటిదని బీఎన్‌ఆర్ పేట జడ్పీ పాఠశాల హెచ్‌ఎం రమేష్ అన్నారు. శుక్రవారం చిత్తూరు రూరల్ మండలంలోని బీఎన్‌ఆర్ పేట జడ్పీ పాఠశాలలో ముందస్తు హిందీ భాషా దినోత్సవం నిర్వహించారు. హిందీ ఉపాధ్యాయుడు ఖాదర్‌బాషా మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థీ హిందీ నేర్చుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుడ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన

వెదురుకుప్పం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బాలికలకు గుడ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన అవసరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శకుంతల తెలిపారు. శుక్రవారం వెదురుకుప్పం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మిషన్ శక్తి సంకల్పపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బాలికల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తే టోల్ ఫ్రీ నెంబరు 112కు సమాచారం ఇవ్వాలన్నారు. హెచ్‌ఎం శ్రీనివాసులు, టీచర్లు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: హైస్కూల్‌లో విద్యార్థినులకు గుడ్, బ్యాడ్ టచ్, పోక్సో యాక్టు, మొబైల్ వాడకం-వాటి అనర్థాలు, సైబర్ క్రైం వంటి వాటిపై సీడీపీవో వనితశ్రీ అవగాహన కల్పించారు. హెచ్‌ఎం జనార్ధన్‌రెడ్డి, సూపర్‌వైజర్లు కవిత, సరళ, అంగన్‌వాడీ టీచర్లు సుజాత, రత్న, జానకమ్మ తదితరులు పాల్గొన్నారు.

యల్లమాంబ జాతర ప్రారంభం


ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళుతున్న గ్రామస్తులు

యాదమరి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కీనాటంపల్లె గ్రామ దేవత యల్లమాంబ ఆలయ జాతర శుక్రవారం ప్రారంభమైంది. పరదరామి ప్రధాన ఆలయం వద్ద నుంచి అమ్మవారి, ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా కీనాటంపల్లెకు తీసుకొచ్చారు. తర్వాత అమ్మవారికి సహస్ర కుంకుమార్చన, కుంభాభిషేకం చేసి.. సారె సమర్పించారు. భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి పుష్పపల్లకిలో అమ్మవారిని ఊరేగించారు.

నిరంజన్ కుటుంబీకులకు థామస్ పరామర్శ

శ్రీరంగరాజపురం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి):సింధురాజపురానికి చెందిన నిరంజన్‌కుమార్(40) కర్ణాటకలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బ్రెయిన్ డెడ్ అవగా, ఆయన అవయవాలను దానం చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నిరంజన్ కుటుంబీకులను శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ విప్ థామస్ పరామర్శించారు. ప్రభుత్వపరంగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయనవెంట ఎస్‌ఆర్‌పురం టీడీపీ అధ్యక్షుడు గంధమనేని జయశంకర్‌నాయుడు, నాయకులు బాలాజీనాయుడు, గంధమనేని రాజశేఖర్‌నాయుడు, నిరంజన్‌రెడ్డి, పైనేని మురళి, కృష్ణమనాయుడు, శ్రీధర్‌యాదవ్, శ్రీనివాస్‌నాయుడు, ఎన్.కుమార్, పుల్లూరు బాబు, వేమానాయుడు, చంద్రబాబునాయుడు, వెంకటాచలం, చంద్రబాబురెడ్డి తదితరులున్నారు.

మహిళల హక్కులపై అవగాహన

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో పీవీకేఎన్ డిగ్రీ కళాశాలలో మహిళల హక్కులు, భద్రతపై విద్యార్థినులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ జీవనజ్యోతి, ఎన్‌ఆర్‌పేట ఎస్ఐ నాగసౌజన్య పాల్గొన్నారు. ● సీటమ్స్ కళాశాలలో శుక్రవారం ఇన్ఫోటెక్ నిర్వహించిన క్యాంపస్ సెలక్షన్‌లో బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ ఫైనల్ ఇయర్ చదువుతున్న 150 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు చైర్మన్ రంగనాథం, ఎండీ కల్పజ తెలిపారు.

'ఉనికి కోసమే వైసీపీ రాద్ధాంతం'


యూరియా పంపిణీ చేస్తున్న మోహన్ నాయుడు

గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తమ ఉనికిని చాటుకోవడానికి వైసీపీకి చెందిన నేతలు యూరియాపై అనవసర రాద్ధాంతం చేస్తున్నారని సింగిల్ విండో త్రీమెన్ కమిటీ చైర్మన్ ముప్పిరి మోహన్‌నాయుడు అన్నారు. గంగాధర నెల్లూరు సింగిల్‌విండో సొసైటీ ఆవరణంలో శుక్రవారం టీడీపీనేతలు, అధికారులతో కలిసి రైతులకు యూరియా బస్తాలను పంపిణీ చేశారు. అర్హులైన ప్రతి రైతుకూ యూరియా బస్తాలను అందజేస్తామని చైర్మన్ చెప్పారు. పార్లమెంట్ టీడీపీ ఎస్సీసెల్ ప్రధానకార్యదర్శి దేవసుందరం, సింగిల్‌విండో సొసైటీ సీఈవో విజయకుమార్‌రెడ్డి, డైరెక్టర్ జ్యోతియాదవ్, స్టాఫ్ అసిస్టెంట్ మునస్వామి, నేతలు జయచంద్రారెడ్డి, పూర్ణాచంద్రారెడ్డి, గోపి, శేఖర్, రైతులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యానికి ప్రాధాన్యం: ఎంపీపీ



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంపీపీ సరిత

శ్రీరంగరాజపురం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఎంపీపీ సరిత అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె ప్రసంగించారు. సీజనల్ వ్యాధులపై వైద్యశాఖ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మండల కో-ఆప్షన్ మెంబర్ ఏసురత్నం మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం వచ్చిన రోజు నుంచి ప్రజా ప్రతినిధులకు ఇంతవరకు గౌరవ వేతనం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ నిరంజన్‌రెడ్డి, జడ్పీటీసీ రమణప్రసాద్‌రెడ్డి, ఎంపీడీవో మోహన మురళి, తహసీల్దార్ లోకనాథం పిళ్ళై, సర్పంచ్‌లు డిల్లెయ్య, మార్కొండయ్య, హరిత, వరదమ్మ పాల్గొన్నారు.

15న మండల స్థాయి క్రీడా పోటీలు

తవణంపల్లె, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల స్థాయి అండర్-14, 17 క్రీడా పోటీలు ఈనెల 15వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంఈవోలు హేమలత, మోహన్‌రెడ్డిలు తెలిపారు. తవణంపల్లె జడ్పీ హైస్కూల్‌లో జరగనున్న పోటీల్లో మండలంలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలల క్రీడాకారులు పాల్గొనవచ్చన్నారు. ఖోఖో, బేస్‌బాల్, చెస్, యోగా పోటీలకు 14-17 ఏళ్లలోపున్న విద్యార్థులు అర్హులన్నారు. కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీలకు వచ్చే క్రీడాకారులు సొంత క్రీడాపరికరాలు తెచ్చుకోవాలని కో-ఆర్డినేటర్,పీడీ లలిత చెప్పారు.

17 వారాలుగా అందని 'ఉపాధి' బిల్లులు

పాలసముద్రం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపాధి హామీ పథకం కింద పనిచేసే శ్రామికులకు 17 వారాలుగా బిల్లులు అందలేదని వాపోతున్నారు. చేసిన పనులకు బిల్లులివ్వకుంటే ఎలా బతకాలని ప్రశ్నిస్తున్నారు. మరోవైపు బిల్లులు రాకపోవడం వల్ల మండలంలోని 13 పంచాయతీల్లో 500 మంది శ్రామికులు పనులకు రావడం లేదని ఉపాధి సిబ్బంది చెబుతున్నారు.

నిరుపయోగంగా 'సంపద' కేంద్రాలు


నిరుపయోగంగా తయ్యూరులోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం

శ్రీరంగరాజపురం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తయ్యూరు, శెట్టివానత్తం, ఎగువ కమ్మకండ్రిగలో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు నిరుపయోగంగా ఉన్నాయి. ఈ కేంద్రాలన్నీ చెత్తాచెదారంతో నిండిపోయాయి. మందబాబులకు నిలయంగా మారాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వీటిని ఉపయోగంలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం: మేయర్ అముద

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని మేయర్ అముద ఆదేశించారు. శుక్రవారం లక్ష్మీనగర్ కాలనీలోని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ సమస్యలపై వచ్చిన వారినుంచి మేయర్ అర్జీలను స్వీకరించారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలిన వాటిని పరిశీలించి పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు. మొత్తం 25 అర్జీలు అందాయి. డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్‌రెడ్డి, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ త్యాగరాజన్, టౌన్ బ్యాంక్ చైర్మన్ కాండ్ర రమేష్ నాయుడు, కమిషనర్ నరసింహ ప్రసాద్, చిత్తూరు రూరల్ ఎంపీడీవో శ్రీనివాసులు, ఎంఈ వెంకటరామిరెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.


బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న మేయర్ అముద తదితరులు

సంక్షిప్తంగా..

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ఆపరేషన్ డివిజన్ పరిధిలోని 11, 33 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఈఈ మునిచంద్ర తెలిపారు. పూతలపట్టు, యాదమరి, బంగారుపాళ్యం, ఐరాల, తవణంపల్లె, చిత్తూరు టౌన్, చిత్తూరు రూరల్, గుడిపాల మండలాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

చెత్త సేకరణలో నిర్లక్ష్యం తగదు: డీఎల్‌పీవో



వెదురుకుప్పం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): చెత్త సేకరణ పనుల్లో నిర్లక్ష్యం తగదని డీఎల్‌పీవో రవికుమార్ అన్నారు. శుక్రవారం పచ్చికాపల్లంలో జరుగుతున్న చెత్త సేకరణ పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి వెంకటేష్ పని తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు.

సన్మానం

దాతకు..



వెదురుకుప్పం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం కేఎంపురం ఆదర్శ ప్రాథమిక పాఠశాలలోని భోజనశాలకు రేకుల షెడ్డు, ఫ్యాన్లు సమకూర్చిన అదే గ్రామానికి చెందిన రవికుమార్‌రాజు సన్మానించారు. శుక్రవారం పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఈవో విజయకుమార్, హెచ్‌ఎం కె.చలపతిరావు, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ సురేష్ పాల్గొన్నారు.

సీహెచ్‌వోకు..



పూతలపట్టు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు పీహెచ్‌సీలో ఏడేళ్లుగా సీహెచ్‌వోగా పనిచేస్తూ యాదమరికి బదిలీపై వెళ్లిన శ్రీనివాసమూర్తిని శుక్రవారం వైద్యాధికారులు, సిబ్బంది సన్మానించారు. డాక్టర్ ప్రియాంక, డాక్టర్ ప్రవీణ, జిల్లా మలేరియా నివారణాధికారి వేణుగోపాల్, సీహెచ్‌వో లక్ష్మీనారాయణ, ఎన్జీవో సంఘం అధ్యక్షుడు భానుప్రకాష్, సిబ్బంది మహేష్, నరసింహ ప్రసాద్, నూర్జహాన్, ధర్మేంద్ర, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఉత్తమ టీచర్‌కు..



గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సిద్దేశ్వరకొండ పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్న కమాలపతినాయుడుకు చిత్తూరులో ఈనెల 5వతేదీన జిల్లా ఉత్తమటీచర్ అవార్డును స్వీకరించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఎమ్మార్సీకేంద్రంలో కమాలపతినాయుడు దంపతులను సన్మానించారు. ఎంఈవోలు ఆంజినేయులుశెట్టి, గుణశేఖర్‌రెడ్డి, టీచర్ల యూనియన్ నేతలు చెన్నకేశవరెడ్డి, గంగాధరం, కోటి, బాబునాయుడు, పరంధామనాయుడు పాల్గొన్నారు.